
బొమ్మరిల్లు


జనవరి '75



1.25 P




కృష్ణ సమర్పించు
శ్రీ విజయకృష్ణ మూవీస్
విజయనిర్మల నటించిన 100వ చిత్రం
దేవదాసు
సినిమాస్కోప్ & ఈస్ట్‌మన్ కలర్
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: విజయనిర్మల నిర్మాత: యస్.రమానంద్ నిర్వహణ: యస్.రవికుమార్
సంగీతం: రమేష్ నాయుడు డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ: వి.యస్.ఆర్.స్వామి....
శ్రీ ఫిలింస్



అన్నపూర్ణ సినీ ఎంటర్‌ప్రైసెస్
ఈస్ట్‌మన్ కలర్
కె.బాపయ్య
పి.రాఘవరావు

CINEMA PROJECTOR

COMPLETE WITH ELECTRIC FITTING



HAVE YOU GOT CINEMA PROJECTOR AT HOME

IF NOT: DO YOU WANT TO ENJOY THE PLEASURE WITH YOUR FAMILY MEMBERS AND FRIENDS TO SEE PICTURES LIKE CINEMA HALL AT HOME ?

IF SO: PLEASE ORDER US TODAY FOR CINEMA PROJECTOR BY V.P.P.

మీరు మీ అభిమాన సినిమా తారను చూడాలంటే నేడే సినిమా ప్రొజక్టర్‌కు ఆర్డరివ్వండి. మీ యింట్లో మీరు సినిమా వేసుకోవచ్చు. సినిమాలో మాదిరిగా మీ అభిమాన తార మీ యింటిలో మీరు ఏర్పాటు చేసుకున్న కర్టెనుపై బ్రహ్మాండంగా నృత్యం చేస్తుంది. విరగబడి నవ్వగలదు. అలాగే ఏం కావాలన్నా చూడగలరు. ఎలక్ట్రిక్ బల్బుతోగాని బ్యాటరీలతో గాని సినిమా ప్రొజక్టర్ పని జేస్తుంది.

నేడే ఒక సినిమా ప్రొజక్టర్‌కి ఆర్డరివ్వండి !

1. జర్మన్ మోడల్ రూ 55/—
2. డీలక్స్ మోడల్ రూ 44/—
3. అమెరికన్ మోడల్ రూ 80/—

} రిఫైండ్ స్క్రీన్ 6 రూ అదనంగా కలర్ ఫిల్మ్ కావాలంటే 100 మీటర్లు 30 రూ.లు. పోస్టేజి అదనం.

ప్రొజక్టర్‌తో 40 మీటర్ల ఫిల్మ్ ఉచితంగా పంపబడును

రూల్:—మీ ఆర్డర్‌తోపాటు 10 రూ. ఎడ్వాన్స్ పంపవలెను

ఎడ్రస్:

GREEN CENTRE (B-12)
Mahabir Nagar, New Delhi-18

బొమ్మరిల్లు


సంపాదకుడు: విజయ-బాపినీడు

పాఠకులకూ, ఏజంట్లకూ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ నెలనుండి బొమ్మరిల్లులో స్టిక్కర్స్ పెడుతున్నాం. ముఖ్యంగా బొమ్మరిల్లు చిన్నారిపాఠకలోకానికి యీ స్టిక్కర్స్ ఎంతగానో నచ్చుతాయని మాకు తెలుసు. వాటిని ఎక్కడ అంటిస్తే అక్కడ అంటుకుంటాయి కదా అని మీ తాతయ్య పొడుం కాయకో, మీ బామ్మ కళ్ళ అద్దాలకో అంటించేయకండి. అలాచేస్తే మీకూ మాకూ కూడా చివాట్లు పడతాయి.

ఈ నెలనుండి నండూరి రామమోహనరావు గారి హరివిల్లు ప్రచురిస్తున్నాం.

బొమ్మలు—బాపు.

సంపుటి : 3 జనవరి 1975 సంచిక 5



పాటల పాట

పాటలు పాటలు పాటలో హొ
తేటమాటలా పాటలో హొ
నెచ్చెలులారా, రారండీ
చెచ్చెర చేరీ, వినిపొండీ.

కోటి కోయిలలు వేణువులై
తేటిగొంతుకలు వీణియలై
పాడిన పాటలు పాటలో హొ
పాపలకోసం పాటలో హొ

చంద్రకిరణముల దారులలో
ఇంద్రధనుస్సుల రంగులలో
మంచుతుంపురుల చిరుజడిలో
మించు తీవెలా అంచులలో

కనబడు అందాలన్నిటినీ
కలలు కలలుగా తెలిగించి
పాడినపాటలు పాటలో హొ
పాపల లోపలి పాటలో హొ.

నండూరి రామమోహనరావు

బొమ్మల పెళ్లి



బొమ్మరింటిలో బొమ్మలపెళ్ళికి
అమ్మలక్కలూ వచ్చారు.
బాకాలూత్తూ, డోల్లుకొట్టుతూ
బాజా భజంత్రి చేశారు.

పెళ్ళికూతురికి పెళ్ళికుమారుడు
మెళ్లో సూత్రం కట్టాడు
పెద్దలందరూ తథాస్తు అంటూ
ఇద్దరి కక్షిత లేశారు

సంగీతంతో పేరంటాళ్లూ
మంగళహారతి పాడారు
విస్తళ్ళేసే గుజ్జనగూళ్ళను
మస్తు మస్తుగా పెట్టారు.




అలకపానుపూ, ఊరేగింపూ
అప్పగింతలూ జరిగాయి.
పెళ్ళికి వచ్చిన పెద్దలందరూ
ఇళ్ళకు మళ్ళీ వెళ్ళారు.

నంగనాచిలా పెళ్ళికూతురూ
దొంగ చూపులూ చూసింది.
పెళ్ళికుమార్తెను పెళ్ళికుమారుడు
గిల్లి మెల్లిగా నవ్వాడు.

బుగ్గలనిండా గులాబిలల్లే
సిగ్గుల మొగ్గలు పూశాయి.

చందమామ



అందమైన చందమామ
అందరాని చందమామ
అమ్మా, నా చేతిలోని
అద్దములో చిక్కినాడె.


గున్నమావి కొమ్మలలో
సన్నజాజి రెమ్మలలో
నక్కినక్కి దొంగల్లే
నన్నుచూచి నవ్వినాడె.

రెక్కలు నాకుంటేనా,
ఒక్క ఎగురు ఎగిరిపోన?

నెలవంకతొ ఆటలాడి
నీ వొడికే తిరిగి రాన?

లెక్కలేని చుక్కలకీ
చక్రవర్తి చందమామ.
నీలినీలి మబ్బులలో
తేలిపోవు చందమామ.

ఆకాశపు చందమామ.
అందాలా చందమామ.
అమ్మా, నా చేతిలోని
అద్దములో చిక్కినాడె.



హరివిల్లు

నండూరి రామమోహనరావు

పిచ్చిప్రశ్నలు

ఆకాశపు పందిరిలో
అంతులేని మల్లెపూలు—
అందుకునే దెల్లాగో
అమ్మ, నాకు చెప్పవటే?

వెన్నెల కిరణాల తోడ
వెండి మెట్ల నిచ్చెనేసి
మబ్బులెక్కి కోస్తానే
మల్లెపూలు నీ కోసం.

దూరంగా జలజలమని
పారే ఆ వాన నీటి
కాలవలో వెళ్ళనటే
కాగితాల పడవమీద?


ఎవరెరగని దేశానికి
ఎక్కడికో పోయి పోయి
పచ్చలు, రత్నాలు, మణులు
పడవనిండ తెస్తానే.


పిచ్చికలకు గూళ్ళుచేసి
పచ్చికతో పరుపులేసి
గుజ్జనగూళ్ళుంచితి, నవి
గూళ్ళలోకి రావేమే?

పిచ్చిక గూళ్ళల్లొ దూరి
వెచ్చగ యీ రాతిరంత
కిక్కురుమనకుండా, నే
నక్కడ పడుకుంటూనే

పోవే, నావన్నీ నువు
పిచ్చి ప్రశ్నలంటావు
నాన్నగారు రాగానే
అన్నీ నే నడుగుతాను.

నాకు కోపమొస్తే, యిక
నీకు కథలు చెప్పనుగా!
నాన్నగారి కొక్కరికే
అన్ని కథలు చెబుతాను.





వెర్రి వెంగళప్ప కథలు

శేషాచారి వెళ్ళక వెళ్ళక ఒకసారి దేవాలయానికి వెళ్ళి, ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూసి "అబ్బ ఎంత పెద్దరాయి!" అన్నాడు. పక్కనున్న అతని స్నేహితుడు అది విని "తప్పు. ఇది రాయి కాదు. దేవుడు. దణ్ణం పెట్టుకో" అన్నాడు. ఆ స్నేహితుడింటే శేషాచారి ఆ రోజు భోజనం చేశాడు. అన్నంలో ఓ రాయి వచ్చింది. "అబ్బ! ఎంత చిన్న దేవుడు" అంటూ శేషాచారి దణ్ణాలు ప్రారంభించాడు.

—పి. వి. కృష్ణ, వైంపల్లి.

* * *

ఒక రాజ్యంలో మంత్రీ సేనానీ అడవి గుండా పోతుండగా వారికో జింకపిల్ల కనిపించింది. "ఇది పులిపిల్ల" అన్నాడొకడు "కాదు. సింగంపిల్ల" అన్నాడు వేరొకడు. వారు తగువు తేలక జింకపిల్లను తెచ్చి, రాజుకి చూపించి అడిగారు.

"మీ మొహాలు! ఏ పిల్లాకాదు. కోనేరులో వేయండి. ఎగిరితే కప్ప, మునిగితే కాకి" అన్నాడు ఆ మహారాజు.

—పల్లిగాని లక్ష్మి, నూజివీడు.

* * *

సుబ్బయ్యశ్రేష్ఠి క్రొత్తగా వ్యాపారం ప్రారంభించి, ఏవి ఎక్కడున్నాయో తెలుసుకోటానికి కందిపప్పు డబ్బామీద 'కందిపప్పు' అని, పెసరపప్పు డబ్బాపై 'పెసరపప్పు' అనీ-యిలా డబ్బాలమీద అన్ని పేర్లూ వ్రాశాడు. ఆ మర్నాడు కొట్టుకు వచ్చేసరికి బెల్లం డబ్బాకు చీమలు పట్టాయి. సుబ్బయ్యశ్రేష్ఠి విసుక్కొని "బెల్లం డబ్బామీద 'బెల్లం' అని వ్రాయటం నాదే బుద్ధి తక్కువ!" అనుకుని చీమలన్నిటినీ దులిపేసి, డబ్బామీద 'కారం' అని వ్రాసి, "ఇప్పుడో!" అన్నాడు నేలమీద పాకిపోతున్న చీమలవంక గర్వంగా చూచి.


—బి. విద్యాసాగర్, విజయవాడ-11.

ఒకతను పట్నం బయలుదేరాడు. అతడు అమాయకుడని తెలిసిన అతని భార్య "దేనికైనా నాలుగుచోట్ల బేరమాడి, ఎక్కడ చవకైతే అక్కడ ఖరీదు చేయండి," అని హెచ్చరించి పంపింది.

అతడు చేరువనున్న రైలుస్టేషన్‌కు వెళ్ళేసరికి పట్నానికి టిక్కట్టు రూపాయి అని చెప్పారు.

అది ప్రియంగా తోచి, కొంత దూరం నడిచి ఆ పక్క స్టేషన్‌లో టిక్కట్టు అడిగాడు. ముప్పావలా చెప్పారు. ఇంకా చవగ్గా కొనాలని, అతడు మరి కాస్త ఎక్కువ నడిచి, అక్కడ స్టేషన్‌లో అడిగాడు. 'టిక్కట్టు పావలా' అన్నారు అక్కడ. 'ఇంతకంటే చవగ్గా మళ్లీ దొరుకుతాయో లేదో!' అనుకుని అతడు వెంటనే జేబునించి రూపాయితీసి పట్నానికి నాలుగు టిక్కట్లు ఇవ్వమన్నాడు.

— జి. పూర్ణచంద్రరావు.



దేవుడు చేయలేని పని

"దేవుడు చేయలేని పనులుకూడా మీరు చేయగలరు. మీరు మహాత్ములు." అంటూ బీర్బల్ ఒక రోజున అక్బర్‌ని పొగిడాడు.

ఆ పక్కనే సభలో బీర్బల్ విరోధి ఒకడున్నాడు. వాడు లేచి అక్బర్‌కు నమస్కరించి, "ప్రభూ! పాముకాటు తిన్నవాడూ, పొగడ్తకు లోనైనవాడూ ఒకడంటారు. మీరు మహా ప్రభువులే-అనుమానంలేదు. కాని బీర్బల్ మిమ్మల్ని దేవుడికన్నా గొప్పవారని పొగిడి,మిమ్మల్ని అపహాస్యం చేస్తున్నాడు." అన్నాడు.

బీర్బల్ పొగడ్త అక్బర్‌కు కూడా నచ్చలేదు. ముఖ్యంగా దేవుడు చేయలేని పనులు తనేమి చేయగలడో అక్బర్‌కు స్ఫురించలేదు.


"బీర్బల్! దేవుడు చెయ్యలేని పని నే నేది చేయగలనో చెప్పి నన్ను ఒప్పిస్తే సరే! లేదంటే నీవు అనవసరంగా పొగిడి, నన్ను మునగచెట్టు ఎక్కించావని భావించి శిక్షిస్తాను." అన్నాడు అక్బర్.


"ప్రభూ! మీరు అవసరమైతే ఎవరినైనా దేశ బహిష్కారం చేయగలరు. దేవుడు కావాలన్నా ఆపని చేయలేడు. కాదంటారా?" అన్నాడు బీర్బల్.

"అదేమిటి!" అన్నాడు అక్బర్ ఆశ్చర్యంగా.

"ఈ విశ్వమంతా దేవుడి రాజ్యమే గనక, దేవుడు దేశబహిష్కరణ శిక్ష విధించినా ఆ మనిషిని ఎక్కడికి పంపాలో ఆయనకే తెలియదు. అది మీకు తెలుసు. మీరు చేయగలరు. ఏమంటారు?" అన్నాడు బీర్బల్.

అక్బర్ సంతోషించి, "ఇక నీవు కూర్చో!" అన్నాడు బీర్బల్ విరోధితో.





పిచ్చి ప్రశ్నలు

ఒక ఊళ్లో ఒక పేదరైతు వుండేవాడు. ధనం లేని కారణాన అతని కుమార్తెకు ఎన్నాళ్ళకూ వివాహం చేయలేకపోయాడు.

రైతుకుమార్తె అందగత్తె అనీ, గుణవంతురాలు అనీ పొరుగూరిలో ఒక భాగ్యవంతుని కుమారుడు విన్నాడు.

'ఆమెకు అందమూ, గుణంతోపాటు తెలివితేటలూ కూడా వుంటే, నేనామెను వివాహమాడతాను' అంటూ భాగ్యవంతుని కుమారుడు బయలుదేరి వచ్చాడు.

దారిలో రైతు పొలంగట్టున కనిపించాడు. భాగ్యవంతుని కుమారుడు తాను ఫలానా అని చెప్పుకుని ఆ మాటా యీ మాటా మాట్లాడి, "ఇంతకూ మీరు చేను కోయిస్తున్నారా? కోస్తున్నారా?" అని అడిగాడు.

అది చచ్చు ప్రశ్నలా అనిపించింది రైతుకు.

"నేను చెప్పేదేముంది? మా అమ్మాయిని పరీక్షించదలచి వస్తున్నారు కదా! ఆమే చెబుతుంది. రండి యింటికి వెళదాం!" అన్నాడు రైతు.

భాగ్యవంతుని కుమారుడు వాగుడుకాయలా వున్నాడు. దారిలో ఓ చోట పేడ ముద్దను చూసి, "ఇది ఆవుపేడా? ఎద్దుపేడా?" అని అడిగాడు రైతుని.

మరి కొంతదూరం పోయాక, స్మశానంలో ఎవరిదో శవం కాలుతుంటే, "బ్రతికున్నవాడి శవం కాలుస్తున్నారా? లేక చనిపోయిన వాడి శవం కాలుస్తున్నారా?" అని అడిగాడు.

ఈ ప్రశ్నలతో రైతుకు చిరాకెత్తిపోయింది. ఇటువంటి వెర్రివాణ్ణి అల్లుడుగా చేసుకుంటే తన కూతురు సుఖపడదని భావించాడు. ఇంటికి రావటమే తరవాయి; భాగ్యవంతుని కుమారుని బయట నిలబెట్టి, కూతురితో , "ఓ వెర్రివాడు నిన్ను పెళ్ళాడతానని వచ్చాడు. అతనికి సరైన జవాబు చెప్పి వదిలించు తల్లీ!" అన్నాడు.

కె. సదానంద్

తండ్రి ఎందుకు ఆ రకంగా అంటున్నాడో ఆమెకు మొదట అర్థంకాలేదు. విషయం ఏమిటి అని తండ్రి నోటివెంట భాగ్యవంతుని కుమారుడు వేసిన ప్రశ్నలన్నీ విన్నదామె.

వెంటనే ఆమె మొహం సంతోషంతో విప్పారి, "నాన్నా, ఆయన చాలా తెలివిగల వారు. నిజంగా ఆయన నన్ను వివాహమాడ దలిస్తే నేను అదృష్టవంతురాలిని," అంది.

"నీకేమైనా మతిపోయిందా?" అన్నాడు రైతు కంగారుగా.

"లేదు. ఆయన పొలం కోస్తున్నారా? కోయించుతున్నారా అంటే, స్వంతపొలమా లేక కౌలుకు తీసుకున్న పొలమా అని అర్థం. స్వంత పొలమైతే మనం కోస్తున్నామని చెబుతాం. కౌలు పొలమైతే కోయిస్తున్నామంటాము, అలాగే పేడ ఆవుపేడా, ఎద్దుపేడా అని అడిగితే మనం అది ఏ పేడ అయినదీ చెప్పవచ్చు. ఆవుపేడ అయితే పేడమీదనే మూత్రం ఉంటుంది. ఎద్దుపేడ అయితే పేడ ఒకచోట, మూత్రం మరో చోట వుంటుంది. మిగిలింది శవం విషయం. పుణ్యకార్యాలు చేస్తూ నలుగురిలో పేరు తెచ్చుకున్నవాడు చనిపోయినా బ్రతికున్నవాడి కిందే లెక్క. అందుకు చనిపోయినవాడు పేరు ప్రఖ్యాతులు కలవాడా, అనామకుడా అని ఆయన అడగటంలో అర్థం!" అన్నది రైతుకుమార్తె.

తండ్రికి, తన ప్రశ్నలలో అంతరార్థం రైతు కుమార్తె విప్పిచెప్పటం భాగ్యవంతుని కుమారుడు విన్నాడు. వెంటనే ఆమెను వివాహమాడేందుకు రైతుకు తన అంగీకారం తెలియజేశాడు.

సమాధానాలు చెప్పేందుకు ఎంత తెలివితేటలు వుండాలో, తెలివిగల ప్రశ్నలు వేసేందుకు కూడా అంత తెలివితేట లుండాలని గ్రహించిన రైతు సంతోషంతో ఆ సంబంధానికి ఒప్పుకున్నాడు.





అద్దం చేసిన అల్లరి

చాలాకాలం క్రితం ఒక కుగ్రామంలో 'వాంగ్' అనే వా డుండేవాడు. అది ఎంత కుగ్రామ మంటే,దాని సమీపంలో రహదారి అన్నదిలేదు.

అక్కడ మనుషులందరూ అమాయకంగా వుండేవారు. వారందరిలోకి 'వాంగ్' మరింత అమాయకుడు.

ఒకసారి వాంగ్ బొగ్గుల కావడితో పట్టణా నికి బయలుదేరాడు. ఇంతకుపూర్వం వాంగ్ ఎన్నడూ ఊరు విడిచినవాడు కాదు. వాంగ్ భార్య అతనిని ఊరి పొలిమేరవరకూ సాగ నంపి, "వచ్చేటప్పుడు నాకో దువ్వెన తీసుకు రా!" అని చెప్పింది.

వాంగ్ యిదివరకు 'దువ్వెన' అనే పదం వినలేదు. "దువ్వెన అంటే ఎలా వుంటుంది?" అని భార్యను అడిగాడు.

ఆ రోజులలో చీనాదేశపు స్త్రీలు కొయ్య దువ్వెనలు వాడేవారు. అవి అర్ధ చంద్రా కారంతో ఒంపుతిరిగి వుండేవి.

వాంగ్ అడిగినదానికి వాంగ్ భార్య ఆకా శానవున్న చంద్రుణ్ని చూపించి, "అదిగో అలా వుంటుంది కొనిపట్టుకురా!"అని చెప్పింది.

వాంగ్ పట్టణంలో బొగ్గును సాంతం అమ్మే శాడు. ఇంటికి బయలుదేరుతూ వుండగా అత డికి భార్య తెమ్మన్న దువ్వెన జ్ఞాపకం వచ్చింది. అయితే దుకాణం వాడికి చెప్పేం దుకు దువ్వెన పేరు గుర్తు రాక, "ఆకాశాన వుండే చంద్రుడిలా వుంటుందట. అదేమిటో గుర్తులేదు. అది యివ్వు!" అని అడిగాడు. దుకాణంవాడు అది అద్దం అనుకుని, వాంగ్ కి అద్దం యిచ్చి పంపాడు.

తిరుగు ప్రయాణంచేసి వాంగ్ క్షేమంగా ఇంటికి చేరాడు. తాను తెచ్చిన వస్తువు భార్య కిచ్చాడు. ఆమె ఆత్రంగా అద్దాన్ని అందుకుని, అందులో తన ప్రతిబింబం కనబడగానే ఏడుపు ప్రారంభించింది. ఆమెకు అద్దమంటే ఏమిటో తెలియదు. ఆ మాటకొస్తే ఆ గ్రామంలో

యం. ఆర్. ప్రసాద్

ఎవరికీ అద్దం అంటే తెలియదు. అందుచేత వాంగ్ భార్య అద్దంలో తన ప్రతి బింబం కని పించేసరికి తన భర్త పట్నంనుంచి ఇంకో భార్యను తెచ్చుకున్నాడనుకున్నది.

ఆమె అలాగే అద్దం పట్టుకుని, తన పుట్టిం టికి పోయి అద్దాన్ని వాళ్ళమ్మకి యిస్తూ, "చూడు. నీ అల్లుడు పట్నంనుంచి యింకో పెళ్ళాన్ని తెచ్చుకున్నాడు," అన్నది ఏడుస్తూ.

ఆ తల్లికూడా యిదివరకు అద్దం ఎలా వుంటుందో చూసిన మనిషి కాదు. ఆమె అద్దం లోకి చూసి, ఆ అద్దంలో తన ప్రతిబింబం కన బడే సరికి, "ఇంకో పెళ్ళాన్ని తెచ్చుకొన దల చినవాడు, పడుచు పెళ్ళాన్ని తెచ్చుకోకుండా, ముసలి పెళ్ళాన్ని తెచ్చుకున్నా డేమిటే!" అన్నది.

తల్లీ కూతుళ్ళు ఏడుపు ప్రారంభించారు.

నలుగురూ పోగై గ్రామాధికారికి ఫిర్యాదు చెయ్యవలసిందే నన్నారు. గ్రామాధికారి వాంగ్ నూ, అతని భార్యనూ, అత్తనూ పిలిపించి, వాంగ్ తెచ్చిన అద్దంలోకి చూశాడు. అందులో గ్రామాధికారిలాంటివాడు కనిపించేసరికి, కోపం పట్టలేక "నా మీద పోటీకి వీణ్ణి పట్టుకొస్తారా, ఉండండి, మీ పొగరణుస్తా!" నంటూ గ్రామాధి కారి ఫిర్యాదీలనూ, ముద్దాయిలనూ ఒక్కొ క్కరికి నూరు కొరడాదెబ్బలు కొట్టమని భటు లకి ఆజ్ఞాపించాడు.

ఈ తీర్పుకి అందరూ గొల్లుమన్నారు.


"మేము యింకో గ్రామాధికారిని తెచ్చు కుంటే మీ దగ్గరకు తీర్పుకు ఎందుకువస్తాం?" అన్నారు వారంతా.

అయినా గ్రామాధిగారి యింకో గ్రామాధి కారిని తెచ్చుకున్నట్టే గొడవ చేశాడు.

గ్రామాధికారి అబద్ధంచెబుతున్నాడనుకుని, నలుగురూ కలిసి ఒక్కసారే అద్దాన్ని లాగారు.

ఈ గలాభాలో అద్దం కాస్తా క్రిందపడి బద్దలై పోయింది; దాంతో అందరి కష్టాలూ తీరాయి.





మోసాల గురువు

ఒక ఊళ్ళో ఒక మోసగాడు వుండేవాడు.

వాడు మోసగాడని వూళ్ళో అందరికీ తెలిసి పోయింది. ఎవరూ దరిచేరనివ్వని కారణాన మోసగాడికి భుక్తి గడవటం కష్టంగా తయారయింది.

"పనికిరాని విద్యనేర్పి యిప్పుడు నాకు తినేందుకు కూడా కూడులేకుండా చేశావు," అంటూ ఆ మోసగాడు ఓ లేఖవ్రాసి, దాన్ని మనిషితో పొరుగూరిలో వున్న తన గురువుకు పంపాడు.

ఆ మర్నాడే మోసగాడి గురువు ఓ యోగి వేషం ధరించి మోసగాడున్న ఊరు వచ్చాడు. ఊళ్ళోకి యోగివచ్చాడని తెలిసి, ఊళ్ళో వాళ్ళంతా పోగయ్యారు. ఆ యోగిని నమ్మాలో అక్కర్లేదో వారి కర్థంకాలేదు. ఊళ్ళో మోసగాడిని పిలిపించి ఆ యోగి నిజమైన యోగో, దొంగయోగో తేల్చిచెప్పమనీ, అందుకు బహుమాన మిస్తామనీ అడిగారు.

మోసగాడు యోగిని చూస్తూనే, ఆ యోగి దొంగయోగి అనీ, తన గురువైన గజమోసగాడనీ తెలుసుకున్నాడు.

వెంటనే పెద్దకేకలు పెట్టి ప్రజలనందరినీ పిలిచి, "వీడా! వీడివల్లే నేను మోసాలు నేర్చుకున్నాను. ఒకప్పుడు వీడు నా గురువు. వీడిని చూస్తే నా ఒళ్ళు మండిపోతోంది. వెధవని తన్నండి," అని కేకలు పెట్టాడు.

వాడి కోపానికిగాని, అరుపులకుగాని యోగి చలించినట్టు కనిపించలేదు. పైపెచ్చు చిరునవ్వు నవ్వుతూ, "నాయనా! నన్ను దూషిస్తున్నావనే చింత నాకు లేదు. ఈ ఊళ్ళో ఏ కొందరో గ్రహపీడితులు వుండివుండాలి. వారిని సంరక్షించే ఉద్దేశ్యంతోనే భగవంతుడు నాకీ ఊరువెళ్ళవలసిందిగా సంకల్పం కలిగించి వుంటాడు. ఆ గ్రహపీడితుల్లో నీవూ ఒకడివై వుంటావు. ఇదిగో యీ తాయెత్తు తీసుకుని కట్టుకో అన్నాడు. తాయెత్తు యిస్తూ.

యం. రఘు

మోసగాడు మరింత మండిపడ్డాడు.

"ఛీ! దొంగసన్యాసీ!" అంటూ గురువుగారు అందిస్తున్న తాయెత్తును లాక్కుని, విసిరి నేల కేసి కొట్టాడు.

యోగి చిరునవ్వు మాయమయింది.

జోలినుండి విభూది తీసి, కాసేపు కళ్ళు మూసి దాన్ని మంత్రించి, "జై! భవానీ! నేనే మహిమగలవాడనైతే, నాలో భగవత్ సంకల్ప ప్రేరణవుంటే, యీ అల్పుడు గిరగిరా తిరిగి కిందపడిపో గాక!" అంటూ విభూదిని మోస గాడిపై జల్లాడు.


మరుక్షణం మోసగాడు పూనకం పూని నట్టు ఊగిపోయాడు. ఆ తరవాత గిరగిరా తిరిగి క్రింద పడిపోయాడు. ప్రజలంతా చూస్తూ వుండగా మోసగాడు నేలమీద పడిపోవటంతో, యోగిశక్తిపై ప్రజలకు గొప్ప నమ్మకం ఏర్ప డింది.

"ఈ మోసగాణ్ణి రక్షించండి. మేము కోరి తేనే అత డిక్కడికి వచ్చాడు. అతణ్ణి మామూ లుగా చేయండి," అని యోగిని వేడుకున్నారు. యోగి మళ్ళీ విభూది మంత్రించి చల్లాడు. మోసగాడు నిద్ర లేచినట్టు లేచి, యోగికి నమ స్కరించి వెళ్ళిపోయాడు.

ఇది జరిగాక ఆ ఊళ్ళోవాళ్ళంతా యోగికి కానుకలు చదివించి, అతడిని అనేక విధాల పూజించారు. రామేశ్వరంలో దేవాలయం కట్టిం చాలని చెప్పి ఆ ప్రజలు యిచ్చినదే గాక అడిగి మరింత ధనం తీసుకున్నాడు. ఆ తరవాత "మళ్ళీ భగవత్‌సంకల్పమైనప్పుడు వస్తాను," అని ప్రజలకు చెప్పి, అతడా ఊరు వదిలి బయలుదేరాడు.

ఊరి పొలిమేరలో గురువుకోసమే వేచివున్న మోసగాడు కనిపించాడు. గజమోసగాడు తానా ఊళ్లో సంపాదించిన డబ్బంతా శిష్యుడి కిచ్చి, "మళ్ళీ ధనం యిబ్బంది ఏర్పడినప్పుడు కబురు పంపు," అని చెప్పి వెళ్ళిపోయాడు.





దివ్య దర్శనం

ఆనాడు ఏకాదశి. నందుడు ఉపవాసం వుండి ఆ రోజంతా విష్ణుపూజలోనే గడిపాడు. మరునాడు చీకటితో లేచి యమునా నదిలో స్నానం చేయడానికి బయలుదేరాడు. ఆయన వెంట నలుగురు వృద్ధగోపకులు కూడా వెళ్ళారు.

అప్పటికింకా తెల్లవారలేదు. అది అసుర వేళ. ఆకాశంలో ఒక తెల్లని మబ్బు తునుక కాంతులు చిమ్మటంచేత తెల్లవారింది అనుకున్నాడు నందుడు.

యమునా నదిలో దిగి నందుడు "హరి హరీ!" అంటూ ఒక మునుగు మునిగాడు. మళ్ళీ పైకి లేవలేదు. ఎవరో అతనికాలు లాగినట్లయింది. నందుడు "కృష్ణా!" అని అరిచాడు. అతని తల నీళ్ళల్లో తేలిపోతూ కనిపించింది. క్షణంలో నందుడు అదృశ్యమయ్యాడు. "కృష్ణా! కృష్ణా!" అన్న పిలుపులు మాత్రం యమునానది మధ్యనుంచి వినిపించాయి.

"నందుడు మునిగిపోయాడు" అని అరుస్తూ గోపవృద్ధులు లబలబలాడుతూ బృందావనం వైపు పరుగెత్తసాగారు. నందుని పిలుపులు ఎప్పుడు వినిపించాయో ఏమో! కృష్ణ బలరాములు పరుగు పరుగున అక్కడికి వచ్చారు. వారి వెంట యశోదా రోహిణులు, గోప గోపికలందరూ హడావుడిగా పరుగెత్తుకు వచ్చారు.

యమునానది నిండుగా ప్రవహిస్తున్నది. నురుగులు కక్కుతున్నది. కృష్ణుడు గభాలున నదిలో దూకాడు. అది చూచి యశోద 'కృష్ణా!' అని కేకపెట్టి వివశురాలై ఒడ్డున పడిపోయింది. అందరూ ఏడుస్తూ ఒడ్డున నిలబడి నదికేసి చూస్తున్నారు. కృష్ణుడు అప్పటికప్పుడే నదీ గర్భంలోనికి చేరి అదృశ్యమైనాడు.

"తమ్ముడు నందబాబును తప్పక తెస్తాడు, నీవు ఏడవవద్దమ్మా!" అని బలరాముడు యశోదను ఓదార్చసాగాడు, "తమ్ముని సామర్థ్యం తెలిసికూడా ఎందుకు విచారిస్తావు?" అని ధైర్యం చెప్పాడు.

జలదేవత వరుణుడు. అతని సేవకుడు అసు


రుడు. రాత్రి మూడో జామున నదిలో దిగి స్నానం చేసేవాళ్ళను బంధించి వరుణలోకానికి తీసుకుపోవడం అతని విధి. ఆనాడు ఆ అసురుడికి వ్రజరాజైన నందుడు దొరికాడు. పరమపుణ్యుడైన నందుణ్ణి బంధించి తీసుకుపోవడంలో అసురుడు నానాయాతనలూ పడ్డాడు.

'ఇతడెవరో పుణ్యపురుషుడు లాగున్నాడు. ఎందుకైనా మంచిది. ఇతణ్ణి వరుణరాజుకు అప్పగిస్తే సరి. ఆయనే ఇతణ్ణి శిక్షిస్తాడు' అని భావించి అసుగుడు నందుణ్ణి వరుణ రాజు కొలువులోనికి ప్రవేశపెట్టాడు.

నందుణ్ణి చూచి, వరుణరాజు గభాలున గద్దె దిగివచ్చి, జరిగిన పొరపాటు తెలుసుకొని "వ్రజరాజా! నన్ను క్షమించండి" అని కాళ్ళ మీద పడ్డాడు. నందుణ్ణి ఒక భద్రాసనంమీద కూర్చోబెట్టి, అసురుడి వైపు తీవ్రంగా చూచి వరుణుడు తన కొరడా ఝళిపిస్తూ "మూర్ఖుడా! నీకు కళ్ళు నెత్తిమీదికి వచ్చాయా? నీవు బంధించవలసింది ఇటువంటి మహాత్ములనా?" అని గద్దించి పలికాడు.

"ప్రభూ! పొరపాటు జరిగింది. ఈ తప్పు క్షమించండి. రాత్రి మూడో జామున అసుర వేళలో ఈ మహానుభావుడు నదిలోకి దిగాడు. తమ ఆజ్ఞచొప్పున అతికష్టంతో పట్టితెచ్చాను. ఇకనుంచీ ఇలాంటి తప్పులు చేయను" అని అసురుడు వరుణరాజు కాళ్ళమీద పడ్డాడు.

ఇంతలో కృష్ణుడు అక్కడికి రానేవచ్చాడు.



వాళ్ళ సంభాషణ అంతా విన్నాడు. కృష్ణుణ్ని చూచి వరుణుడు వాకిట్లోనే సాగిలపడి మ్రొక్కి "దేవా! ఈ అపరాధమంతా నాదే. ఈ తప్పు క్షమించు. నీ తండ్రి ఇక్కడే క్షేమంగా వున్నాడు. ఆయన్ను సగౌరవంగా చేర్చేబాధ్యత నాది" అని భయభక్తులతో విన్నవించుకున్నాడు. కృష్ణుణ్ని తన సింహాసనంమీద కూర్చోబెట్టి పూజించాడు. "నీ పాదస్పర్శవల్ల ఈ లోకం పవిత్రమయింది. నా భటుడు పొరపాటున నీ తండ్రిని పట్టి తెచ్చి నీ దర్శనభాగ్యం నాకు కలిగించాడు" అని ఎంతగానో ప్రస్తుతించాడు

నందుడు వరుణదేవుని భవనం పరిశీలిస్తూ లోనికి వచ్చాడు. గద్దెమీద కూర్చొని పూజ లందుకొంటున్న తన కుమారుణ్ణి చూచి "కృష్ణా!" అంటూ గబగబా వెళ్ళి కౌగిలించు కున్నాడు. వరుణుడు ఆ తండ్రీకొడుకులకు ఎన్నెన్నో కానుక లిచ్చి, వారిని పూజించాడు. నీళ్ళపై నడిచే తన రథంమీద వారిద్దర్నీ ఎక్కించి, తాను స్వయంగా రథాన్ని నడిపి, కొన్ని క్షణాలలోనే యమునానది ఒడ్డుకు చేర్చాడు. తెచ్చిన కానుకలన్నీ ఇచ్చి, వరుణుడు సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

అద్భుతమైన వస్త్రాలూ, పుష్పమాలలూ ధరించి వచ్చిన నందుణ్ణీ, కృష్ణుణ్ణీ చూచి గోపకులందరు గాఢంగా కౌగిలించుకున్నారు. వారి వస్త్రాలు తడిసినట్లే లేవు."కృష్ణుడు నన్ను వరుణలోకంనుంచి తెచ్చాడు. వరుణలోకం ఎంతో అద్భుతంగా వుంది. మన కృష్ణుణ్ణి



వరుణరాజు తన సింహాసనంమీద కూర్చోబెట్టి పూజించాడు. మీరు కృష్ణుడంటే ఎవరను కుంటున్నారు? సాక్షాత్తు శ్రీమన్నారాయణు డితడు!" అని నందుడు ఏమేమో చెప్పాడు. అతని ఒళ్ళు పులకరించింది.


గోపవృద్ధులు కృష్ణుడి వంక దీనంగా చూచారు. వారి అభిప్రాయం తెలుసుకొని కృష్ణుడు వారిని అక్కడున్న బ్రహ్మ మడుగులో మునిగిరండని చెప్పాడు. గోపవృద్ధులు అలాగే వెళ్ళి ఆ మడుగులో మునిగారు. వేయి పడగల ఆదిశేషునిమీద నల్లకలువల కాంతితో, నాలుగు చేతులతో శ్రీమన్నారాయణుడు కోటి సూర్యుల ప్రకాశంతో కనిపించాడు. ఎఱ్ఱని పాద తలాలు, తెల్లని గోళ్ళకాంతులు, మెఱుపులవంటి పీతాంబరం, వక్షస్థలంమీద కౌస్తుభ రత్నం, వనమాలా, శ్రీ వత్సమూ, ముఖాన చిరునవ్వూ, దయాభరిత నేత్రాలతో భగవంతుడు తమ వంకకు చూస్తున్నట్లుగా గోపవృద్ధులకు తోచింది. సునందాది పార్షదులు పక్కన నిలుచున్నట్లు, సకల దేవతలూ, ఋషులూ, ప్రహ్లాద నారదాది భక్తులూ నమస్కరిస్తున్నట్లూ, దివ్యరూపాలు తాల్చి వేదాలు ప్రస్తుతిస్తున్నట్లూ వారు చూచారు.

ఇంటిలో నిద్రపోతున్న నందుడికి కూడా ఈ దృశ్యం కనిపించింది. 'కృష్ణా!' అంటూ లేచాడు.

తలగడ దగ్గర కూర్చున్న కృష్ణుడు "నాన్నా! నీవు కలగంటున్నావు. మూడు రోజులనుంచీ నీవు నన్ను గురించి ఏమేమో చెబుతూ, అదే స్వప్నంలో కూడా చూచావు" అని సర్ది చెప్పాడు.

బృందావనం సామాన్యమైనది కాదు. అక్కడి జనులుకూడా సామాన్యులు కారు. శ్రీమన్నారాయణుడు ఉండే గోలోకమే బృందావనంగా అవతరించింది. ఆ గోలోకవాసులే ఇక్కడ గోపకులుగా, అవతరించారు. మనసా, వాచా, కర్మణా ఎల్లప్పుడూ శ్రీకృష్ణుణ్ణి సేవిస్తూండటమే వారిపని.





దేముడున్నాడు


పూర్వం మగధలో విశ్వకర్మ అనే కంసాలి ఒకడు వుండేవాడు. బంగారు నగలు చేయడంలో అతనికి మంచి పేరు వుండేది. విశ్వకర్మకు మంచి పనితనమయితే ఉందికాని, బుద్ధిమాత్రం మంచిది కాదు. ఎంతటివారి నగలోనయినా సరే ఓ గురివింద గింజంత బంగారమున్నా తెలివిగా కాజేయకుండా వదిలేవాడుకాడు. కొంతకాలానికి ప్రజలకు విశ్వకర్మ మోసం చేస్తున్నాడని తెలిసిపోయి అతని వద్ద సొమ్ములు చేయించుకోవడం మానుకున్నారు. దానితో విశ్వకర్మకు భుక్తి గడవడం కష్టమయింది.

విశ్వకర్మకు హరి అని ఒక కొడుకు వున్నాడు. హరి బుద్ధిమంతుడు మాత్రమేకాక చాలా సాత్వికస్వభావుడు. కొడుక్కు మెల్లగా పనిలోని రహస్యాలన్నీ నేర్పాలని విశ్వకర్మ చాలా ప్రయత్నం చేశాడు కాని హరి ఆ దొంగ విద్యలు నేర్చుకోలేదు. దానితో విశ్వకర్మ, కొడుకు నెప్పుడూ చీదరించుకుంటూ 'పులి కడుపున చలిచీమ పుట్టింది!' అంటూండేవాడు.

విశ్వకర్మ ఇక దరిద్రాన్ని భరించలేక బాగా ఆలోచించి ఒక ఎత్తువేశాడు. తన పనితనం అంతా ఉపయోగించి గాజుతో ఒక రత్నాన్ని తయారుచేశాడు. పాదరసంలో దాన్ని శుద్ధిచేసి పుటంపెట్టేసరికి అది నిజం రత్నాలకన్నా ఎక్కువగా మెరవసాగింది. మరేవో రసాయనాలతో అన్ని రకాల పరీక్షలకూ అది నిజమైన రత్నంలాగే కనపడేటట్లు చేశాడు. తరువాత దానిని తీసుకొనిపోయి కౌశాంబిలోని సముద్రగుప్తుడనే ఒక మహా ధనవంతునికి లక్ష బంగారు నాణాలకు అమ్మివేశాడు. ఆ ధనాన్నంతా తీసుకొని వచ్చి భద్రంగా ఒక దంతపు పెట్టె లోపలి రహస్యపు సొరుగులో దాచి ఆ పెట్టెను భోషాణంలోపెట్టి దానిమీద మామూలుగా పాతసామానులు పెట్టాడు విశ్వకర్మ!

కౌశాంబిలోని సముద్రగుప్తునికి ఈ రత్నాన్ని కొనడంలో ఒక ఉద్దేశ్యముంది. సముద్రగుప్తునికి తామ్రలిప్తి రేవునుండి తూర్పుతీర ద్వీపా

ఎస్. వాణీబాల



లకు సుగంధద్రవ్యాల వ్యాపారం చేయాలనే సంకల్పం కలిగింది. అది కోట్ల లాభసాటి బేరం. అయితే తామ్రలిప్తి రేవునుండి ఈ వ్యాపారం చేయాలంటే దానికి మగధరాజు గుణాకరుడు అనుమతి ఇవ్వాలి. అందుకని గుణాకరునికి విలువైన వస్తువులు ఏవైనా కానుకగా ఇచ్చి వ్యాపారానికి అనుమతి పొందాలని సముద్రగుప్తుని ఆలోచన.

ఈ ఊహప్రకారం సముద్రగుప్తుడు ఆ రత్నాన్ని చిన్న సంచిలో పెట్టుకొని దాన్ని బొడ్డులో దోపుకొని తగిన ఆహారపదార్థాలు తీసుకొని ప్రయాణీకులు చాలామంది వెళ్తుంటే వారితోబాటు కౌశాంబినుండి మగధ రాజధానికి బయలుదేరాడు.

అలా వెళ్తూవుండగా ఒక అరణ్యంవచ్చింది. అక్కడ ప్రయాణీకులంతా విశ్రమించారు. అంతా నిద్రపోతే ప్రమాదమని కొందరు కాపలా కాస్తూ కొందరు నిద్రపోసాగారు. సగం రాత్రి అయినాక మేలుకున్నవారు నిద్రపోవడమూ, నిద్రపోయిన వారు లేచి కాపలా కాయడమూ ఇలా నిర్ణయించుకొన్నారు. సముద్రగుప్తుడు సగం రాత్రి మేలుకొని తన పక్కనున్న వర్తకుణ్ణి లేపి తాను పడుకున్నాడు.

నిజానికి ఆ పక్కనున్నవాడు వర్తకుడు కాడు. చత్వారకుడు అనే గజదొంగ. వర్తకుని వేషంలో ఇలా ప్రయాణీకులతో కలసి ప్రయాణం చేస్తున్నాడు.

చత్వారకుడు మొదటినుంచీ సముద్రగుప్తుడు మాటిమాటికీ బొడ్లో సంచీని తడివి చూచుకోవడం గమనిస్తూనే వున్నాడు. సమయంకోసం ఎదురు చూస్తున్న చత్వారకుడు, సముద్రగుప్తుడు బాగా నిద్రపోయాడని గమనించగానే మెల్లగా అతని బొడ్డులోని సంచీని కాజేసి చల్లగా చెట్లచాటుగుండా తప్పించుకొని పారిపోయాడు.

అలా పారిపోయి చత్వారకుడు మగధ రాజధానిని చేరాడు. చేరి రత్నాన్ని వంద సువర్ణాలకు అమ్మజూపాడు. ఆ రత్నాన్ని పరీక్షించిన రత్నవర్తకుడు ఆ జాతిరత్నం కోటి బంగారు నాణాలకు తక్కువ వెల ఉండదని అంచనా వేశాడు. అలాంటిది ఇంత చౌకగా

అమ్మడంతో ఇదేదో దొంగసొమ్ము కావచ్చునని అనుమానించి చాటుగా రక్షకభటులకు కబురు చేశాడు. రక్షకభటులు వచ్చి చత్వారకుని బంధించి రాజువద్దకు తీసుకుపోయారు. గుణాకరుడు విచారించి ఆ రత్నాన్ని స్వాధీనం చేసుకొని చత్వారకుణ్ణి ఖైదులో వేశాడు.

ఇలా వుండగా బదరికాశ్రమంనుండి సిద్ధేంద్రయోగి మగధకు వేంచేశాడు. సిద్ధేంద్రుడు సాక్షాత్తూ పరమశివుని అవతారమేనని ప్రజల విశ్వాసం. ఆయన అడుగుపెట్టినచోట కరువుకాటకాలూ, విప్లవాలూ ఉండేవికావు. అలాటి మహాత్ముడు తమ రాజ్యం మీదుగా పోతూ వుండేసరికి ప్రజలంతా ఎన్నోవిధాల ఆయనకు పూజలు చేశారు.

గుణాకరునికి సిద్ధేంద్రుని రాక తెలిసింది. వెంటనే సపరివారంగా పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతమివ్వడానికై బయలుదేరాడు. వెళ్తూ స్వామివారికి కానుకగా ఇవ్వడానికి ఏదైనా విలువైన వస్తువు తీసుకొని పోవాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడు చత్వారకుని వద్ద స్వాధీనం చేసుకున్న రత్నం రాజుదృష్టికి వచ్చింది. గుణాకరుడు ఆ రత్నాన్ని బంగారు పళ్ళెంలో పెట్టుకొని తీసుకువెళ్ళాడు.

గుణాకరుడు సిద్ధేంద్రుణ్ణి ఎన్నోవిధాల పూజించాడు, తాను తెచ్చిన రత్నాన్ని ఆయనకు కానుకగా సమర్పించాడు. సిద్ధేంద్రుడు ప్రభువుకు తీర్థప్రసాదాలు ఇచ్చి పంపాడు.



సిద్ధేంద్రుని రాకను గూర్చి హరికూడా విన్నాడు. అంతటి మహాత్మునికి కానుక ఇవ్వడానికి ఏదైనా విలువైన వస్తువు దొరుకుతుందేమోనని భక్తిభావంగల హరి, తండ్రి ఇంట్లో లేని సమయంలో రహస్యంగా ఇల్లంతా వెతికాడు. హరికి భోషాణంలో పాత సామానుల చాటునవున్న దంతపుపెట్టె కనిపించింది. తన ఇంట్లోని వస్తువులన్నింటిలోకీ ఇదే అందమైన వస్తువని భావించి హరి దానిని అంగరఖా కప్పి తీసుకొని వెళ్ళాడు.

అలా వెళ్ళి హరి సిద్ధేంద్రునికి పాదపూజ చేసి తాను తెచ్చిన దంతపుపెట్టెను కానుకగా సమర్పించాడు. సిద్ధేంద్రుని శిష్యులంతా దాని పనితనానికి మెచ్చుకున్నారు. 'ఓహో! రత్నం


లాటిపెట్టె!' అని పొగిడారు శిష్యులు. సిద్ధేంద్రు నికి ధనంమీదా, సత్కారాలమీదా ఎలాంటి మోజులేదు. అందుకని హరిభక్తికి సంతోషించి ప్రభువు తనకు కానుకగా ఇచ్చిన అమూల్య రత్నాన్ని హరికి ఇచ్చాడు సిద్ధేంద్రుడు. హరి ఆ రత్నాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు.


ఇంతలో ఒక వర్తకుడు ఏడుస్తూ సిద్ధేం ద్రుని వద్దకు వచ్చాడు. అతడెవరోకాదు- సముద్రగుప్తుడే!

"స్వామీ! అరణ్యంలో దొంగలు నన్ను దోచుకున్నారు." అంటూ సముద్రగుప్తుడు సిద్ధేంద్రుని పాదాలపై పడ్డాడు. సిద్ధేంద్రుడు చిరునవ్వునవ్వి హరి ఇచ్చిన దంతపుపెట్టెను సముద్రగుప్తునికి కానుకగా ఇచ్చి పొమ్మ న్నాడు. బరువుగా ఉన్న ఆ దంతపు పెట్టెను తీసుకొని సముద్రగుప్తుడు వెళ్ళిపోయాడు. ఇంటికివెళ్ళి చూచుకునేసరికి దానిలోని రహ స్యపు సొరుగు బయట పడింది. అందులో లక్ష సువర్ణాలు కనపడ్డాయి. 'ఆహా! మహర్షి ఆశీస్సు' అనుకున్నాడు సముద్రగుప్తుడు!

అక్కడ హరి ఆనందంతో ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటికివచ్చిన విశ్వకర్మ భోషా ణంలో దంతపుపెట్టె కనపడకపోవడంతో గగ్గో లెత్తిపోతున్నాడు. "నాన్నా, నాన్నా చూశావా మహర్షి గొప్పతనం. నేను కానుకగా ఇచ్చిన మామూలు దంతపు పెట్టెను తీసుకొని సిద్ధేం ద్రులు నాకీ కోటి సువర్ణాలు ఖరీదు చేసే రత్నాన్ని కానుకగా ఇచ్చారు" అని తండ్రికి ఆ రత్నాన్ని అందజేశాడు.

కొడుకు మాటలు వింటూ విశ్వకర్మ ఆ రత్నాన్ని చూచి అది తన దొంగరత్నమేనని పోల్చుకున్నాడు. దానితో విశ్వకర్మ పెద్దగా ఏడుస్తూ లబో దిబోమని నెత్తీనోరూ కొట్టు కున్నాడు. అయితే అంత విలువైన రత్నంవస్తే తండ్రి ఎందుకేడుస్తున్నాడో హరికి మాత్రం కొంచెం కూడా అర్థంకాలేదు.





తిట్టు కవిత్వం

భోజుడు ఒకనాడు కొలువు తీరివుండగా "మహాప్రభూ! తమ దర్శనార్థం శేఖరుడూ, కవిశేఖరుడూ అనే ఇద్దరు కవిసోదరులు కాశీ నగరంనుంచి వచ్చారు" అని ద్వారపాలకుడు విన్నవించాడు. 'సరే! వారిని ప్రవేశపెట్టు' అని భోజుడు అనుమతినిచ్చాడు.

అయితే భోజుడికి ఒక ఆలోచన వచ్చింది. 'ప్రతిరోజూ ఎవడో ఒక కవికాని, పండితుడు కాని వస్తున్నాడు, నీవు ఇంద్రుడివనీ చంద్రుడివనీ పొగిడిపోతూనే వున్నాడు. నేను కూడా మనిషినే కదా! నాలో మాత్రం లోపాలు వుండవా? కాబట్టి నన్ను పొగిడే బదులు తిడితే ఎలా వుంటుందో చూడాలి' అనుకున్నాడు.

ఈ లోపల శేఖరుడూ, కవిశేఖరుడూ సభలోకి ప్రవేశించారు.

అప్పుడు భోజుడు ఇలా అన్నాడు:

"మహాకవులారా! నేను మీకొక సమస్య నిస్తున్నాను. అదేమిటంటే మీరు నన్ను పొగడకూడదు. తిట్టాలి. ఎవరు అందంగా తిడతారో వారికి ఉత్తమ బహుమానం ఇస్తాను. ఈ సమస్య శేఖరునికీ, కవిశేఖరునికీ మాత్రమే కాదు; నా సభలోని కవులకు కూడా వర్తిస్తుంది" అన్నాడు.

ఇది వినేసరికి కవుల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. రాజుగారిని తిట్టడ మేమంత కష్టం కాదు. ఏవో నాలుగు లేనిపోని ఆరోపణలు కల్పించి తిట్టవచ్చు. కాని ఆ తిట్లు నిరూపించుకోవాలికదా! ఏ లోపమూ లేని భోజుడిని దూషించడం ఎలా?

ఒకవేళ దూషించి బహుమతి పొందినా 'వీడు నన్ను తిట్టాడు' అన్న కోపం రాజుగారి మనస్సులో మిగిలిపోతే తరువాత తమగతి ఏం కావాలి? అందుకని ఒక్కరూ నోరు విప్పలేదు.

అప్పుడు కాశీ నగరంనుండి వచ్చిన అన్నదమ్ములు శేఖరుడూ కవిశేఖరుడూ, చిరునవ్వు నవ్వి ఒకరిముఖం ఒకరు చూచుకున్నారు. కళ్ళతోనే ఏదో మాట్లాడుకున్నారు. ఆ తరువాత శేఖరుడు "మహాప్రభూ! నేను తిట్టు

పాకాల లక్ష్మి

కవిత్వం చెపుతాను.అనుమతించండి" అన్నాడు.

ప్రభువు కుతూహలంతో అంగీకరించాడు.

సభికులంతా ఊపిరి బిగబట్టుకొని అతడు ఏమని తిడతాడో చూద్దామని కూర్చున్నారు.

అప్పుడు శేఖరుడు ఈ శ్లోకం చెప్పాడు:

"సర్వజ్ఞ ఇతి లోకోయం। భవంతం భాషతే మృషా।

పదమేకం నజానీషే। వక్తుం నా స్తీతి యాచకే।"

దీని అర్థం ఏమంటే "ఓ రాజా! నిన్ను అందరూ సర్వజ్ఞుడవని అంటారు. కాని అది నిజంకాదు. నీకు భాష పూర్తిగా రానేరాదు. ఎందుకంటే నీ నోటినుండి 'లేదు' అనే మాట యాచకుల ముందు ఎన్నడైనా వచ్చిందా? ఆ రెండు అక్షరాలే రాని నీవేమి పండితుడివి?" అని భావం.

ఆ తర్వాత కవిశేఖరుడు మరో శ్లోకం ఇలా చదివాడు:

"సర్వదా సర్వదోసీతి। మిథ్యాత్వం కథ్యసే బుధైః

నారయో లౌభిరే వృష్టం। నవక్షః పరయోషితః"


దీని భావం ఏమంటే "ఓ రాజా! అందరూ నిన్ను దాతవని పొగుడుతారు. (నా తమ్ముడు కూడా ఇప్పుడు నీకు 'లేదు' అనే మాట రాదన్నాడు) కాని అది నిజంకాదు. నీవు కూడా ఇవ్వలేనివి కొన్ని వున్నాయి. మాటవరసకు శత్రువులకు నీవు వీపు ఎప్పుడైనా ఇచ్చావా?పరస్త్రీలకు నీ హృదయాన్ని ఎన్నడైనా ఇచ్చావా? ఈ మాత్రం ఇవ్వలేనివాడివి నీవు 'అన్నీ ఇచ్చేవాడివి' ఎలా అవుతావు?" అని అర్థం.


ఇది విని అంతా చప్పట్లు చరిచారు.

ప్రభువు చిరునవ్వు నవ్వి "మీరు తిట్టినా నన్ను పొగిడినట్లుగానే వుంది కదయ్యా వాటిలోని అర్థం?" అన్నాడు.

"ఇంతకన్నా మిమ్మల్ని తిట్టడం ఇక అసాధ్యం ప్రభూ!" అన్నారు కవిసోదరులు.

భోజుడు ఆనందంతో వారిని ఘనంగా సత్కరించి పంపాడు.





విదూషకుని కథ

దేవసేనుడు సంభ్రమాశ్చర్యాలతో తిరిగి వచ్చి "ఓహెూ! ఇతడే ఈ భూమిమీద అందరిలోకీ మహా వీరుడు. ఇంతవరకూ నా కుమార్తె మందిరంలోకిపోయి బతికి బయటపడ్డవాడే లేడు కదా!" అనుకొని మహా వైభవోపేతంగా దుఃఖలబ్ధికకూ విదూషకునికీ పెండ్లి చేశాడు.

కొద్దిరోజులు విదూషకుడు పౌండ్రవర్ధనంలో వున్నాడు. కాని భద్రను వెతుకుతూపోయే పని మాత్రం విరమించుకోలేదు. ఒక రాత్రి దుఃఖలబ్ధిక నిద్రపోయాక విదూషకుడు రహస్యంగా అంతఃపురంనుండి ఇవతలకి వచ్చి నగరం దాటి తెల్లవారకముందే ఎన్నో యోజనాల దూరం వెళ్ళిపోయాడు.

విదూషకుడు అలా పోగా పోగా తామ్రలిప్తి అనే రేవుపట్టణం వచ్చింది. అక్కడనుండి తూర్పు సముద్రంమీద ప్రయాణంచేసి అవతల తీరం చేరితే ఆ తరువాత కొన్నివేల యోజనాలకవతల ఉదయ పర్వతం వస్తుంది.అందుకని ముందుగా ఈ సముద్రం దాటే సంకల్పంతో అక్కడ స్కందదాసు అనే ఓడల వ్యాపారస్థునితో స్నేహంచేశాడు. స్కందదాసు సరుకును ఓడ కెక్కించుకొని సముద్రంమీద పోయేందుకు సిద్ధంగా వున్నాడు. విదూషకుడూ ఆ ఓడలో ఎక్కాడు. గాలి అనుకూలంగా వీయగానే ఓడ బయలుదేరింది.

అలా కొన్ని రాత్రులూ కొన్ని పగళ్ళూ ప్రయాణం చేశాక ఒకనాడు ఓడ దేనికో కొట్టుకొని ఠకీమని ఆగిపోయింది. ఏ అయస్కాంత పర్వతం వచ్చిందోనని లోపలి కళాసీలంతా భయపడ్డారు. స్కందదాసు రత్నాలతో సాగర పూజ చేశాడు. అయినా ఓడ కదలలేదు. దానితో ఓడ మునిగిపోతుందని భయపడి "ఎవడు నా ఓడను ముందుకు పోనిస్తాడో అతనికి నా ధనంలో సగాన్ని ఇచ్చి నా కూతురు నిచ్చి పెళ్ళిచేస్తాను" అన్నాడు. కళాసీ లెవరూ దిగేందుకు సాహసించలేదు. సరే! ప్రయాణం ఆగిపోయిందే, అన్న బెంగతో విదూషకుడు సముద్రం లోపలికి దిగడానికి అంగీకరించాడు.

ఉ మా దే వి



వెంటనే కళాసీలు విదూషకుని నడుముకూ, చంకలకూ పెద్ద పెద్ద తాళ్ళుకట్టి సముద్రంలో దిగవిడిచారు. విదూషకుడు అగ్నిదేవుణ్ణి స్మరించి ఆగ్నేయఖడ్గాన్ని చేతబట్టుకొని సముద్రం అడుగుకు వెళ్ళిపోయాడు. ఈ ఓడ ఆగిన ప్రదేశంలో ఒక జలరాక్షసుడు పడుకొని నిద్రపోతున్నాడు. వాని కాలుకు తగిలి ఓడ ఆగిపోయింది. విదూషకుడు ఒకే దెబ్బతో జలరాక్షసుని కాలును నరికివేశాడు. జలరాక్షసుడు పెద్దగా అరుస్తూ సాగర గర్భంలోకి పారిపోయాడు. ఓడ యథేచ్ఛగా ముందుకుసాగింది.

విదూషకుడు నీటి అడుగునుండి పైకివచ్చి చూచాడు. ఓడకు అడ్డంకి తొలగగానే స్కందదాసుడి బుద్ధి మారిపోయింది. విదూషకుణ్ణి పైకి రానిస్తే సగం ఆస్తినీ, కూతురునూ ఇవ్వవలసి వస్తుందన్న లోభంతో కళాసీలను పిలిచి తాళ్ళను తెగగోయమని చెప్పాడు. కట్టివేసిన తాళ్లు తెగిపోగానే విదూషకుడు సముద్రపు అలలపై పడిపోయాడు. చూస్తూండగానే ఓడ కనుచూపు దూరం దాటి వెళ్ళిపోయింది.

అలలు తీవ్రంగా వున్నాయి. తుపానువచ్చే సూచనకూడా కనపడుతున్నది. విదూషకునికి ఏమి చేయాలో తోచలేదు. ఇంతలో తాను నరికిన జలరాక్షసుడికాలు నీటిపై తేలుతూ కనిపించింది. విదూషకుడు ఈదుకుంటూ దాని వద్దకుపోయి ఆ రాక్షసునికాలునే తెప్పగా చేసుకొని దానిమీద కూర్చున్నాడు. అలలకు ఊగుకుంటూ మహావేగంగా ఆ జలరాక్షసుడి కాలు తూర్పుతీరానికి సాగిపోయింది.

అలా ఏడు రాత్రులూ, ఏడుపవళ్ళూ ప్రయాణం చేశాక భూమి తగిలింది. విదూషకుడు ఒడ్డుకెక్కి తాను వచ్చిన ప్రదేశాన్ని గూర్చి భోగట్టా చేశాడు. అది దిగంబర దేశమనీ, తాను చేరింది దానికి రాజధాని అయిన కర్కోటక నగరమనీ తెలిసింది. మానవులు అపకారం చేసినా దేవుడు సహాయపడుతున్నాడని విదూషకుడు ఆనందించాడు.

ఆ కర్కోటక నగరానికి ప్రభువు ఆర్యవర్మ. అతడు నగరంలో అతిథులకోసం ఒక అన్నదాన సత్రం కట్టించి ఆ పక్కనే అందమైన ఓ బంగారు దేవాలయం నిర్మించాడు. విదూ

షకుడు ఆ సత్రానికిపోయి భోజనాదులు ముగించుకొని, ప్రయాణపు బడలిక కొంత తీర్చుకున్నాడు. ఇంతలో నగరవీధిలో నగారా శబ్దం వినబడింది. ఒక రాజభటుడు చాటింపు వేస్తూ "ఈ నగరంలో బ్రాహ్మణుడు కాని, క్షత్రియుడుగాని ఎవరైనా రేపు ఉదయం రాజుగారి మందిరానికి వస్తే అతనికి ప్రభువు తన కుమార్తెనిచ్చి పెండ్లిచేస్తా రహో-" అని ప్రకటన చేస్తున్నాడు. విదూషకుడు ఈ వింత ఏమిటో చూద్దామని రాజమందిరానికి ఎటు పోవాలని ఆ సత్రం అధికారిని అడిగాడు. అధికారి విదూషకుణ్ణి ఎగా దిగా చూచి చాటుకు పిలిచి "నాయనా! నీ వెవరో ఈ వూరుకు కొత్తవానిలా వున్నావు. అది రాజమందిరం కాదు; మృత్యుమందిరం. లోనికిపోయినవాడే కాని బయటకు వచ్చినవాడు లేడు" అని చెప్పాడు రహస్యంగా. 'అయితే తప్పకుండా నేనా మందిరంలోకి పోవలసిందే!' అనుకున్నాడు విదూషకుడు.

మరునాడు ఉదయం రాజభటులు దోవ చూపగా ఆర్యవర్మ భవనం చేరాడు విదూషకుడు. ఆర్యవర్మ కొత్తగా వచ్చిన ఈ వీరుణ్ణి ఎన్నో విధాల గౌరవించాడు. మనస్సులోవున్న దుఃఖాన్నంతా దాచుకొని 'ఇతడెవరో అగ్నిదేవునిలా ప్రకాశిస్తున్నాడు. కనీసం ఇతడైనా విజయుడై తిరిగివస్తే బాగుండు'నని అనుకున్నాడు మహారాజు. రాత్రి అయింది. విదూషకుడు పరిచారికలు దోవచూపగా రాజకుమారి గదిలోకి ప్రవేశించాడు. అక్కడ కన్నీళ్ళతో కూర్చొని వున్న రాజకుమారిని చూచాడు. గది తలుపులు మూత పడ్డాయి.



ఆ మరుక్షణంలోనే ఏదో భయంకరశబ్దం వినపడింది. విదూషకుడు అగ్నిదేవుణ్ణి స్మరించి ఆగ్నేయఖడ్గాన్ని చేతిలోకి తెచ్చుకున్నాడు. ఇంతలో అంతఃపురం అవతల గాలిలో ఒక బ్రహ్మరాక్షసుడు కదులుతూ వున్నట్లు విదూషకుడు పసికట్టాడు.. వాడికి కుడిచేయిలేదు. 'ఓహో! వీడే పౌండ్రవర్ధనంలోని రాక్షసుడై వుండవచ్చు'నని ఊహించాడు విదూషకుడు. ఇంతలో రాక్షసుడు మెల్లగా భయంకరమైన తన ఎడమచేతిని రాజకుమార్తె



పడకగదిలోపలికి ప్రవేశపెట్టాడు. ఈ రెండవ చేయికూడా నరికితే వీడు పారిపోగలడని భావించి విదూషకుడు ఒక్క క్షణం ఊరుకున్నాడు. రాక్షసుడు క్రమంగా గదిలోకి ప్రవేశించాడు. వెంటనే ఒక్కగంతులో విదూషకుడు రాక్షసుని భుజాలమీది కెక్కి "దుర్మార్గుడా! చూడు నిన్నేంచేస్తానో" అని ఖడ్గాన్ని పైకెత్తాడు. ఖడ్గపుకాంతులకే రాక్షసుని సగం ప్రాణాలు పైకెగసిపోయాయి. మరుక్షణమే వాడు విదూషకుని రెండు కాళ్ళూ పట్టుకొని తనకు ప్రాణభిక్ష పెట్టమని ప్రార్థించాడు.

"నీ వెవడవు? ఎందుకిలా నరహత్య చేస్తున్నావు?" అని ప్రశ్నించాడు విదూషకుడు.

"స్వామీ వినండి. నా పేరు యమదంష్ట్రుడు. పూర్వజన్మలో నాకు ఇరువురు కుమార్తెలు వుండేవారు. వారు ఈ జన్మలో పౌండ్రవర్ధన రాజకుమారిగానూ, కర్కోటక రాజకుమారిగానూ జన్మించారు. మహాసత్వుడైనవాడు తప్ప సామాన్య నరుడు నా కుమార్తెలను వివాహమాడకూడదని నా సంకల్పం. అందుకని క్షుద్ర మానవుల నందరినీ నేను హతమార్చివేస్తున్నాను. ఇటీవల పౌండ్రవర్ధనంలో ఎవడో వీరుడు నా కుడిచేయి నరికాడు. ఇవ్వాళ నీవు నన్ను చంపడానికి వచ్చావు. ఈ ఇరువురినీ తప్ప నన్నెదిరించిన మహావీరులను నేను చూడనేలేదు" అన్నాడు యమదంష్ట్రుడు.

విదూషకుడు నవ్వి "యమదంష్ట్రా! పౌండ్రవర్ధనంలో నీ కుడిచేయి నరికిన వీరుణ్ణి నేనే!" అని చెప్పాడు.

దానితో యమదంష్ట్రుడు విదూషకునికి పూర్తిగా లొంగిపోయాడు "మహావీరా! మీరే నా కుమార్తెలకు తగిన భర్తలు. అంతేకాదు. మీ రెప్పుడు ఎక్కడికి ప్రయాణం చేయాలనుకున్నా నన్ను స్మరించండి. క్షణంలో వచ్చి నాపై ఎక్కించుకొని గగనమార్గంలో గమ్యస్థానం చేరుస్తాను" అన్నాడు యమదంష్ట్రుడు. ఇలా విదూషకునితో స్నేహంచేసుకొని రాక్షసుడు తిరిగి వెళ్ళిపోగానే విదూషకుడు ఆ రాత్రి రాజకుమారి గదిలోనే నిద్రించాడు.

తెల్లవారగానే ఆర్యవర్మ జరిగిన సంగతంతా తెలుసుకొని తన కూతురును విదూష



కుని కిచ్చి వివాహం చేశాడు. కొన్నాళ్లు రాజు గారి సంతృప్తికొరకు కర్కోటక నగరంలోనే వుండి ఒకరాత్రి ఎవ్వరికీ చెప్పకుండా, విదూష కుడు తిరిగి తన ప్రయాణం సాగించాడు.

కర్కోటక నగరం దాటివచ్చి విదూషకుడు రాక్షసుణ్ణి స్మరించాడు. వెంటనే యమదం ష్ట్రుడు ప్రత్యక్షమైనాడు. "మిత్రుడా! నేను నా భార్య భద్ర అనే విద్యాధరిని కలుసుకునే నిమిత్తం ఉదయపర్వతం పోవాలనుకుంటు న్నాను. నన్నక్కడికి తీసుకొనిపో" అని కోరాడు. వెంటనే యమదంష్ట్రుడు విదూష కుణ్ణి భుజాన ఎక్కించుకొని గగనమార్గంలో ఎగురుతూ ఎన్నో యోజనాలదూరం తీసుకొని పోయి అవలీలగా శీతోద మనేనదిని దాటి ముందుకు సాగిపోయాడు. అప్పుడు ఉదయ పర్వతం వచ్చింది. యమదంష్ట్రుడు విదూష కుణ్ణి దింపి "మిత్రుడా! ఇదే పవిత్రమైన సిద్ధ పర్వతం. దీని పైకి వచ్చేందుకు నాకు అర్హత లేదు" అని చెప్పి అదృశ్యమైనాడు.

విదూషకుడు సిద్ధపర్వతం పైకి ఎక్కుతూ వుండేసరికి అక్కడొక కొలనూ అందులోనుండి నీరు తీసుకొనిపోతున్న అప్సరసలూ కన బడ్డారు. "మీరీ నీరు ఎక్కడికి తీసుకుపోతు న్నారు?" అని ప్రశ్నించాడు విదూషకుడు.

"మా మహాదేవి భద్రకోసం తీసుకుపోతు న్నాము. వచ్చి కొంచెం ఈ బిందె నా బుజాని కెత్తరాదూ?" అన్నది ఒక అప్సరస.

విదూషకుడు మెల్లగా బంగారు బిందెను ఆమె బుజాని కెత్తుతూ బిందెలో తన రత్నపు టుంగరాన్ని జారవిడిచాడు.

అప్సరసలు పైకిపోయి నీటితో భద్రకు స్నానంచేయిస్తూ వుండగా రత్నపుటుంగరం భద్రముందు పడింది. ఆమె ఆశ్చర్యపోయి "ఈ ఉంగరం ఎక్కడిది?" అని అడిగింది.

"ఎవరో ఒక యువకుడు బిందె నా బుజాని కెత్తాడమ్మా, అతని చేతిదై వుండవచ్చు" నని చెప్పింది చెలికత్తె.

"చెలులారా! ఈ ఉంగరం ధరించినవాడే నా భర్త. మహాశక్తివంతుడు. నా జాడ తెలుసుకొని ఈ సిద్ధపర్వతం చేరివుంటాడు. వెళ్ళి తీసుకొనిరండి" అన్నది భద్ర.



డున్న భార్యలలో ఏ భార్యఅయితే. సీతలా అహర్నిశలూ తనకోసం కలవరించిపోతుందో చూడాలనే ఆలోచన వచ్చింది. ఆ విషయం వెంటనే తేల్చుకోవాలని మరకతుడు నిశ్చయించుకుని, భార్యలకు ఎవరికీ చెప్పకుండా ఆతడు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

మహారాజు కనిపించటంలేదని కోటలో కలకలం బయలుదేరింది. పట్టపురాణి లలితాంబ, మహారాజు కనిపించటంలేదని విన్నప్పుడు చిరునవ్వునవ్వి, "ఇలా మహారాజు కనిపించకపోవటం నాకు కొత్త కాదు.ఆయన్ని ఇరవైరోజులు చూడని సమయాలు కూడా వున్నాయి. బహుశా మహారాజు ఏ ప్రియురాలి గదిలోనో, మరొకంటికి తెలియకుండా పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని భావించి వుండవచ్చు," అన్నది.

"లేదు మహారాణీ! మేము రాణులందరి గదులకూ వెళ్ళివచ్చే, మీ కీ వార్త చెబుతున్నాం," అన్నాడు మంత్రి.

అప్పుడుకూడా లలితాంబ నవ్వి, "మిగతా రాణుల సంగతి మీకు ఏమి తెలుసు? రాజుని కొంగున ముడివేసుకుని దాచి-ఏమీ ఎరగమనే జాణతనం వున్నది వారిలో.మహారాజు గురించి చింతించకండి. ఏదో ఒకనాడు ఆయన ఏదో ఒక రాణి గదిలోంచి ఊడిపడతారు. మీరు వెళ్ళండి," అంది. మంత్రికి ఏమి చేయటానికీ తోచక రాజు ఎక్కువగా ప్రేమించే కుముదినీ దేవి అనే రాణిని కలుసుకుని మహారాజు కనిపించని సంగతి విన్నవించాడు.


"మహారాజంటే నన్ను గాఢంగా ప్రేమించవచ్చు.కాని ఆయనకున్న వందమంది భార్యల్లో నే నొక్కదాన్ని. కావాలంటే ఆ వందమంది కన్నా నన్ను కాసేపు ఎక్కువ విచారించమంటే విచారిస్తాను. అంతకన్నా నేను ఏమి చేయగలను?" అంది కుముదినీదేవి.

అప్పటికీ వూరుకోలేక మంత్రి మరికొంత మందిరాణులను కలుసుకుని మహారాజు కనిపించకపోవటం సంగతి చెప్పేసరికి, "పలచబడ్డ మజ్జిగలాగా చూపించాడాయన నా మీద ప్రేమ. ఆయన ప్రేమించిన రాణులను కళ్ళు ఉబ్బేలా ఏడ్వనీయండి. అప్పుడు నేనూ ఏడు

స్తాను" అని ఒకరూ, "రాజులేనప్పుడు రాజ్యం పదహారు ముక్కలు కావలసిందే-నా వాటా నాకు పంచండి" అని మరొకరూ, "నా మనస్సు తెలుసుకోకుండా ఆయన నన్ను వివాహమాడి అంతఃపురానికి చేర్చాడు. దేవుడు క్షమించడు," అని యింకొక రాణీ, యిలా అంతా తలోక విధంగా అన్నారు. మంత్రికి తల తిరిగి పోయి నట్టయింది.

మూడు నెల్ల తరవాత, ఒకరోజున అక స్మాత్తుగా మహారాజు కోటకు తిరిగి వచ్చాడు. తను కనిపించకపోయేసరికి రాణులు ఎలా విల పించిందీ కుతూహలంతో మంత్రిని అడిగాడు.

"ప్రభూ! నా నోటితో చెప్పలేను. మీరే ఒక సారి రాణివాసాలకు వెళ్ళి తిలకించి రండి," అన్నాడు మంత్రి. మహారాజు మొదట కుముదినీదేవి అంతఃపురంలోకి వెళ్ళాడు. ఆమె మహారాజుని చూస్తూ ఎక్కడలేని ఆనందాన్నీ కనబరుస్తూ, "అబ్బ! వచ్చారా! మీరు కనిపిం చటంలేదని మంత్రి ఏదేదో చెప్పాడు, మీ ఆయుష్షు పెద్దదని నాకు తెలుసు. మీరు ఏమీ కారు అని అప్పుడే అనుకున్నాను," అంది. పైగా ఆమె యిదివరకటిలాగానే సర్వాలంకర ణలతో మిలమిల్లాడుతూ కనిపించసాగింది. మహారాజు ఏమయ్యాడోనన్న బాధ ఆమెకు రవ్వంతకూడా కలగలేదని రాజు తెలుసుకుని, పట్టపురాణి అంతఃపురానికి వచ్చాడు. మహా రాజునిచూసి, ఆమె ఓ చిరునవ్వు నవ్వింది.'ఈ



రాజా ఏదో అయిపోయేది! ఇన్నాళ్ళ తరవాత పాపం ఏ రాణి గదినుండో యివతలకు ఊడి పడివుంటాడు!' అని ఆ నవ్వు అర్థం. మహా రాజుకి పట్టపురాణిలో కూడా మార్పు కనిపించ లేదు. అతడు ఆత్రుతగా మిగతా రాణుల అందరి గదులూ తిరిగి చూశాడు. ఎవరిలోనూ, తను కనిపించని చింత కనిపించలేదు.

"ఇంతమంది వుండి, ఏ ఒక్కరూ తన కోసం దిగులుపెట్టుకుని మంచం పట్టలేదు. ఈ ప్రేమలేని వారిని ఎందుకు తన కోటలో వుంచాలి?" అనుకున్నాడు మహారాజు.

వెంటనే ఒక్కొక్క భార్యకు తగినంత ధనం యిచ్చి ఎవరి పుట్టింటికి వారిని పంపే శాడు. రామాయణంలో సీతలాంటి యిల్లాలు



తనకు కావాలనే కోరిక మాత్రం మహారాజులో చావలేదు. ఒక అందమైన యువతిని చూసి, ఆమెను వివాహమాడి, "నీవే నా ప్రాణం. నీవు తప్ప నేను మరో స్త్రీవంక కన్నెత్తి చూడను," అని ఆమెకు వాగ్దానం చేశాడు. ఆ విధంగానే ఆ యువతినే తన పంచప్రాణాలుగా చూసుకుంటూ వచ్చాడు మహారాజు. ఆమెపై ఈగను వాలనిచ్చేవాడు కాదు. రాచకార్యాలు వదిలేసి, ఎప్పుడూ ఆమెను అంటిపెట్టుకుని తిరిగేవాడు. రాజు చూపిస్తున్న అభిమానానికి కొత్తరాణి తన్మయురాలైపోయేది. ఆయన కనిపించని క్షణం ఆమె విలవిల్లాడి పోయేది.

"ఇక అనుమానంలేదు. ఈమె రామాయణంలో సీతే!" అనుకున్నాడు మహారాజు.

ఆమెనుకూడా పరీక్షించాలనే కోరిక కలిగి, అతడు ఇదివరకటిలాగానే ఎవరికీ చెప్పకుండా కొన్ని రోజులపాటు మాయమయ్యాడు.

మహారాజు కనిపించటంలేదని మంత్రి ద్వారా విన్న కొత్తరాణి కంగారుపడిపోయింది. కాలుకాలిన పిల్లిలా ఆమె మహారాజుకోసం కోటంతా స్వయంగా గాలించింది. ఉద్యానవనాలన్నీ స్వయంగా వెదికి వచ్చింది. అయినా మహారాజు కనిపించలేదు.

చివరకు ఆమె చాటుగా మంత్రిని పిలిపించి, అతడికి అనేక వజ్రవైడూర్యాలు బహుమతిగా యిచ్చి, "మన చారులనందరినీ పంపించి మహారాజుని గాలించమనండి. నేరస్తుణ్ణి పట్టుకునేందుకు ఎలా గాలిస్తామో అలా గాలించమనండి. మహారాజు తిరిగి సింహాసనానికి రాగూడదు. ఇదీ మన ధ్యేయం. ఈ ధ్యేయంతో గాలింపు జరిపించి, మహారాజు మనకికలేడు, అని అనిపించండి," అంది.

అయితే మంత్రి విశ్వాసం కలవాడు గనుక అలాగేనని రాణికి చెప్పి, మహారాజుకోసం చారులను పంపి గాలించి, రాజు కనిపించగానే కొత్త రాణి ఆజ్ఞ అతడికి విన్నవించాడు.

"ఆమెపై అంతగా ప్రేమచూపిన నన్ను ఆమె చంపించమన్నదా?!" అన్నాడాశ్చర్యంగా రాజు. అతడు కోటకు తిరిగి వస్తూనే కొత్తరాణిని రాజ్యాన్నుండి వెళ్ళగొట్టించాడు.


కరాళుడు యీ కథచెప్పి, "ఓ ప్రియా!


మహారాజు అంతగా ప్రేమించినా కొత్త రాణి 'రామాయణంలో సీత' దేనికి కాలేకపోయింది? రాజు కనిపించటం లేదనగానే ఆమె ఆతురతగా, కోట ఉద్యానవనం స్వయంగా ఎందుకు గాలించినట్టు? తనని ప్రాణసమానంగా ప్రేమించే భర్తను ఆమె ఎందుకు చంపమన్నట్టు? అంతగా ప్రేమించినా మహారాజుకి సీతలాటి భార్య లభించక పోవటం కేవలం దురదృష్టమా? స్వయంకృతాపరాధమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెబితేసరి, లేదా ఓటమిని ఒప్పుకుని యీ కాంతకు పాదాక్రాంతుడివికా!" అన్నాడు.

వీరుని వేషంలో వున్న సవిత్ర్యకుడు అప్పుడీ విధంగా చెప్పాడు:

"ఒకప్పుడు రాజుకి అనేకమంది భార్యలుండేవారు. వారిపై మోహంమొత్తి రాజు తనని వివాహమాడాడని కొత్తరాణి అనుకున్నది. రాజు కనిపించకపోవటంతో, రాజుకి తనపై మోహం మొత్తిందేమోనని కంగారుపడింది. నిజంగా రాజు మాయమయ్యాడా అని ఆమె ఆతురతతో కోట, ఉద్యానవనాలూ వెదికింది. ఇలాగే పూర్వం ఒకసారి మాయమై తిరిగి వస్తూనే, రాణులను కోటనుండి పంపేశాడు. అలాగే యీ సారి అతడు తిరిగివచ్చాక, తనను కూడా కోటనుండి బయటికి పంపేస్తాడని కొత్త రాణి భయపడింది. రాణివాసపు జీవితం చేయి జారిపోతుంది. పైగా వదిలేసిన భార్యగా పేరు పడి బతకవలసివుంటుంది. అందుకామె రాజు శాశ్వతంగా తిరిగిరాకుండా మంత్రిని సహాయం అడిగింది. సీతలాటి యిల్లాళ్ళకు దేశం గొడ్డు పోలేదు. మహారాజు తన భార్య 'సీత' కావాలనుకున్నాడేగాని తను 'రాముడు'లా ప్రవర్తించలేదు. పరీక్షల పేరుతో కట్టుకున్న యిల్లాళ్ళను కాలదన్నాడు. అతడికి స్వచ్ఛమైన 'సీత' దొరకాలనుకున్నప్పుడు, అతడు స్వచ్ఛమైన రాముడిలా ప్రవర్తించాల్సింది. అందుకే అతడు సీతలాటి యిల్లాలిని పొందలేకపోయాడు.

ఈ సరైన సమాధానం వినటంతో కరాళుడు తారెత్తి ఆ స్త్రీని వదిలి మరో స్త్రీలోకి పారిపోయాడు. కరాళుడు వదలగానే, ఆ స్త్రీ అడవి కోతిగా మారి అరణ్యంలోకి పరుగు తీసింది.





దభా దిభీ ధమా ధిమీ

ఒకనాటి ఉదయం కుందేలు అరణ్యంలో తిరుగుతుండగా, దానికి దూరాన్నుంచి ఫెళ ఫెళమనే పెద్ద ధ్వని, ఆ వెంటనే దభీమంటూ చెవులు చిల్లులుపడే శబ్దం వినిపించినై. కుందేలు అదురుకుని ఒక గంతువేసి, "ఏమిటింత భయం కర ధ్వని? కొండశిఖరం ఏమైనా విరిగి కింద పడిందా?" అంటూ కేక పెట్టింది.

తన ప్రశ్నకు ఎవరైనా జవాబిస్తారని కుందేలు అనుకోలేదు, భయంకొద్దీ అది అలా కేక పెట్టింది. కాని, అంతలోనే చెట్టు కొమ్మల్లో వున్న కోతి ఒకటి కిందకు దిగివచ్చి "ఒరే, కుందేలల్లుడూ! ఇది కొండశిఖరం విరిగి నేల పడటంలాలేదు! ఏదో ప్రళయమే!" అన్నది.

కోతి మాట ముగించే లోపలే మరొకసారి ఫెళఫెళా రావాలతో ఆ చుట్టు పక్కల ప్రాంతం దద్దరిల్లిపోయింది. కోతి ఎగిరి చెట్టెక్కబోయేసరికి, కుందేలు దాని తోకపట్టు కుని వెనక్కుగుంజి, "ఒరే, మామా! అగు! నువ్వు చెపుతున్నట్టు నిజంగా ప్రళయం అంత భయంకరం అయిందయితే, నువ్వు చెట్టుమీద వున్నా, చెట్టుకింద వున్నా చచ్చిన వాడికిందే లెక్క, అవునా? ఉట్టినే భయంతో గడగడ లాడిపోతూ యీ వయసులో అనవసరంగా రక్తపోటూ, గుండెజబ్బూ తెచ్చుకోక. నా మాటవిని, అదేదో చూసివద్దాం పద." అన్నది.

ఆ రెండూ భయంకర ధ్వని వస్తున్నవైపు కొంతదూరం పోయేసరికి, ఎదురుగా ఒకచోట ఇద్దరు మనుషులూ, ఒక ఏనుగూ కనిపించాయి. మనుషుల్లో ఒకడు గొడ్డలితో పెద్దపెద్ద చెట్ల మొదళ్ళకు గాట్లు పెడుతున్నాడు. ఏనుగు మీద వున్న రెండవ మనిషి, ఏనుగును అదిలిస్తుండగా అదిపోయి, తొండంతో చెట్టు బోదెను పట్టుకునిలాగి, చెట్టును ఫెళఫెళా రావాలతో నేలమీదపడేలా చేస్తున్నది.

"ఒరొరే, మామా! ఇదా ప్రళయం? దీన్ని చూసేనా మనం అంతగా తారుకుపోయింది. సిగ్గు సిగ్గు!" అన్నది కుందేలు.

"సిగ్గున్నర, సిగ్గున్నర! మా వానరజాతికే

గుత్తా విజయలక్ష్మి

అవమానకరం. ఈ సంగతి ఎక్కడా అనకురో అల్లుడో! మనం పిరికి వెధవలమనుకుంటారు," అంటూ కోతి దాపులనున్న చెట్టెక్కింది.

కుందేలు వున్నచోటునే నిలబడి, ఏమి చేయటమా అని ఒకక్షణం ఆలోచించింది. కోతి చెప్పిన ప్రళయం అన్నమాట నమ్మి తానూ బాగా కంగారు పడిపోయింది. వీలయితే ఎలుగ్గొడ్డునూ, తోడేలునూ, నక్కనూ కూడా కంగారెత్తించటం ఎలా వుంటుంది?

కుందేలు యిలా ఆలోచిస్తూనే అంతఎత్తున ఎగిరి దభీమంటూ కిందపడి లేచి, కాలి సత్తువ కొద్దీ పరిగెత్తుతూ, "దభాదిభీ, ధమాధిమీ ప్రళయం! మహాప్రళయం!" అంటూ కేకలు పెట్టసాగింది.

అది అలా కేకలు పెడుతూ అరణ్యంలో కొంతదూరం పోయేసరికి, ఒక చెట్టుమీద పక్షి గుడ్లకోసం గాలిస్తున్న జంగుపిల్లి దాని కేకలు విని, "అవ్ మ్యావ్! ఒరే, కుందేలల్లుడూ! ఏమిటా కేకలు? దభాదిభీ, ధమాధిమీ ఏమిటి? ప్రళయం ఎక్కడ? కొంచెం ఆగు!" అని కేక పెట్టింది.

కుందేలు ఆగకుండా, "జంగుపిల్లత్తో, ఆగే వీల్లేదు. ఎవరికివారే యమునాతీరే, అన్నారు పెద్దలు. మావ సంగతి మావచూసుకుంటాడు. నువ్వు లగెత్తు. ప్రళయం వచ్చి పడుతున్నది. ప్రళయం! మహా ప్రళయం!" అన్నది.

కుందేలు తెలివిగలదీ, ధైర్యంగలదీ అని జంగుపిల్లికి బాగా తెలుసు. అలాటి కుందేలే



ప్రళయం వెంటపడగా, కిందా మీదా చూసుకోకుండా అరణ్యానికి అడ్డంపడి పరిగెత్తుతుంటే, ఇక తనేపాటి? అలా అనుకుంటూనే జంగుపిల్లి చెట్లకొమ్మల్లో ఒక్క ఎగురు ఎగిరి, "దభాదిభీ, ధమాధిమీ ప్రళయం! మహా ప్రళయం!" అంటూ పరిగెత్త సాగింది.

జంగుపిల్లి కేకలు, ఆ సమయంలో అటుకేసి వచ్చిన నక్కా, తోడేలూ విని ఆశ్చర్యపోతూ, "ఓయ్, జంగుపిల్లత్తా! ఏమిటి సంగతి? ఎందుకలా లగెత్తుతున్నావ్?" అని అడిగాయి.

"ఆగేందుకులేదు దభాదిభీ, ధమాధిమీ! ప్రళయం! మహాప్రళయం" అన్నది జంగుపిల్లి పరుగెత్తుతూనే.



తమకన్న వాడిగల కోరా, గోరూ వుండి, అంతెత్తు చెట్లెక్కి చుట్టూ కోసులదూరం చూడగలిగిన జంగుపిల్లే, ప్రళయం వస్తున్న దని పరిగెత్తుతూవుంటే, తాము ఆలోచిస్తూ నిలబడటం బుద్ధి తక్కువ అనుకుని నక్కా తోడేలూ కూడా తోకలు పైకెత్తి అరణ్యానికి అడ్డంపడి పరిగెత్తసాగాయి.

కొంతదూరం పోయాక వాటికి ఎలుగుబంటి తారసపడి, "ఒరే, తమ్ముళ్ళూ, అదేం లగెత్తుడ్రో! ఎవళ్ళతోనైనా పరుగుపందెం వేశారా? కాస్త ఆగండి," అన్నది.

"అన్నా, ఆగలేము, దభాదిభీ ధమాధిమీ! ప్రళయం వెంటపడి తరుముతున్నది," అంటూ నక్కా, తోడేలూ దౌడు తీయసాగాయి.

ఈ మాటలు వింటూనే ఎలుగుబంటి నిలువెల్లా ఓసారి వణికిపోయి, వెనక్కు ఓసారి తిరిగి పరుగుతీయసాగింది. దానికి దారిలో ఒక చోట తాబేలు వెల్లికిలా పడుకుని మెడా, కాళ్ళూ ఆడిస్తూ కనిపించింది. ఎలుగుబంటి దాని దగ్గిరకుపోయి, "ఒరే తాబేలు మామా! నువ్వు వెల్లికిలాపడి సూర్య నమస్కారాలు అఘోరిస్తున్నావల్లే వుంది. లే లే, ప్రళయం వచ్చి పడుతున్నది. దభాదిభీ, ధమాధిమీ!" అంటూ పరిగెత్తబోయింది.

తాబేలు చప్పున బోర్లాపడి లేచి నుంచుని, ఎలుగ్గొడ్డును ఆగమని కేకవేసి, "ఒరే గొడ్డు మావా! కాస్తాగు. ధమాధిమీ ఏవిఁటి? ప్రళయం ఏవిఁటి? పోతుతాడి కల్లేమైనా మరో చుక్క జాస్తిగా పట్టించావా?" అని అడిగింది.

తాబేలు తనతోపాటు పరిగెత్తకుండా నిలబడటం చూసి ఎలుగ్గొడ్డు కొంచెం ధైర్యం తెచ్చుకుని, తాను నక్కా తోడేలూనుంచి విన్నమాటలు తాబేలుకు చెప్పింది. వెంటనె తాబేలుకు, యీ గొడవ వెనక కుందేలు వేసిన ఎత్తుగడ ఏదో వుందన్న అనుమానం కలిగింది. అదీ, కుందేలూ ప్రాణస్నేహితులు గదా!

తాబేలు చిన్నగా నవ్వి, "ఒరే, గొడ్డుమామా! ఆ ప్రళయం సంగతి నేను చూస్తాను. నువు పోయి ఆ నక్కాతోడేలు చవటాయిలను యిక్కడికి లాక్కురా" అన్నది.

ఎలుగ్గొడ్డుపోయి తోడేలునూ, నక్కనూ

పట్టుకుని యీ ప్రళయం సంగతి ఎవరు చెప్పా రని నిగ్గతీసి అడిగింది. అవి జంగుపిల్లి చెప్పి నట్టు చెప్పాయి. జంగుపిల్లిని నిలదీసి అడి గితే, యీ సంగతి తాను కుందేలునుంచి విన్నానన్నది.

ఆ నాలుగింటికీ ఇందులో ఏదో మోసం వుందని తోచి, తాబేలు దగ్గిరకువచ్చి సంగతి సందర్భాలన్నీ చెప్పుకున్నై. తాబేలు తన వూహ సరైనదేననీ, కుందేలు వీటిని ఒక ఆట పట్టించి ఏడ్పించేందుకు యీ పని చేసిందనీ గ్రహించి, "అలా అయితే, అందరూ రండి. ఆ కుందేలల్లుడి దగ్గిరకుపోయి, అసలు సంగ తేమిటో తెలుసుకుందాం!" అన్నది.



అన్నీ కలిసి కుందేలు ఇంటికి పోయేసరికి, అది ఇంటిముందున్న ఒక బండరాయిమీద కూర్చుని, కళ్ళుమూసుకుని, చెవులాడిస్తూ ఏదో గొణుక్కుంటున్నది. తాబేలు దాని ముందుకు పోయి, "ఒరే, అల్లుడూ! కళ్ళు తెరు. వచ్చిన వాళ్ళెవరో చూడు! ఇంతకూ నీవు గొణిగే దేమిటి?" అని అడిగింది.

కుందేలు కళ్లుతెరిచి తాబేలునూ, దాని పక్కనే నిలబడివున్న ఎలుగ్గొడ్డునూ తోడే లునూ చూసి గతుక్కుమని, అంతలోనే తెప్ప రిల్లి చిరునవ్వు నవ్వుతూ, "మావలూ, బావలూ! అందరికీ దణ్ణాలు. నేను ప్రళయ నిరోధ మంత్రం జపిస్తున్నాను. మీరు వినే వుంటారు... దభా దిభీ, ఢమా ఢిమీ, అంటూ ప్రళయం అరణ్యంలో తిరుగుతున్నది," అన్నది.

ఆ మాటలకు ఎలుగుబంటి పళ్ళు కొరు కుతూ, "ఒరే దొంగ కుందేలల్లుడూ! అతి తెలివి కబుర్లు చెప్పకు. నువ్వనే ఆ ప్రళయం మాలో చూసిన వాళ్ళెవరూ లేరు. నువ్వు మొట్టమొదటగా ఆ అబద్ధం జంగుపిల్లితో చెప్పి, మమ్మల్నందర్నీ పిరికివెధవల కింద ఒక ఆట ఆడించావ్!" అన్నది.

తోడేలూ, నక్కా, జంగుపిల్లీ ఒకేసారి అరిచి కుందేలుమీదికి దూకపోయినై.

తాబేలువాటికి అడ్డుగా వచ్చి, "ఆగండి! ఆగండి!" అని కుందేలుతో "ఒరే అల్లుడూ! గొడ్డు మామకు నువ్వు చెప్పకోబోయే సంజా

యిషీ ఏమిటి?" అన్నది.

కుందేలు ఎందుకైనా మంచిదని పారి పోయేందుకు వీలుగా కాస్త వెనక్కి జరిగి నిలబడి, "అందరూ కళ్ళెర్రచేసి నా మీదికి చెయ్యెత్తబోవటం నాకు బాధ అనిపించటం లేదుగాని, అడకూతురు జంగుపిల్లత్త కూడా కోరలు చాచటం చాలా బాధకలిగిస్తున్నది! ఎంత కుందేలునైనా నేను మగవాణ్ణి, అవునా? సరే, ఆ ప్రళయం దభాదిభీ,ధమాధిమీ అంటూ అరణ్యంలో తిరగటం వినదలిస్తే, ప్రాణం మీద ఆశలేని వాళ్లు నా వెంటరండి," అంటూ బయలుదేరింది.

కుందేలు వెనకగా అన్ని జంతువులూ కదిలినై.

కుందేలు వాటిని, మొదట్లో తాను శబ్దం విన్న ప్రాంతానికి తీసుకుపోయింది, ఏనుగూ, మనుషులూ కంటబడకపోయినా, చెట్లు పడి పోతున్న భయంకర ధ్వని మాత్రం వాటికి విని పించి, అన్నీ భయంతో ముఖాముఖాలు చూసు కుంటూ ఆగిపోయినై.

కుందేలు వాటితో, "ఊఁ, ఆగారేం? రండి. ఒక్క తాబేలు మామను తప్ప, మిగిలిన వాళ్ళనందరినీ ఆ ప్రళయానికి బలిపెట్ట బోతు న్నాను," అంటూ వళ్ళు కొరికి ముందుకు సాగింది.

ఎలుగుబంటూ, తోడేలూ, నక్కా, జంగు పిల్లీ ఒక్క చావుకేక పెట్టి,"ఒరే కుందేలల్లుడూ! మమ్మల్ని ఆ దభాదిభీ ధమా ధిమీ ప్రళయా నికి బలిపెట్టకు. నువ్వు అబద్ధం ఆడావన్నం దుకు చెంపలు వేసుకుంటున్నాం. సరా?" అంటూ వెనుదిరిగి పరిగెత్తసాగినై.

కుందేలు, "ఆగండి! ఆగండి!" అంటూ వాటిని కొంతదూరం వెంటబడి తరిమి, తాబే లుతో కలిసి పొట్టచెక్కలయేలా నవ్వుతూ గంతులు వేయసాగింది.

(బొమ్మరిల్లు అనుబంధం కథ)





శిథిల నగరం


[జరిగిన కథః—ఆనందుడనేవాడు అనాథ యువకుడు. గోవిందస్వామి దగ్గర అతడు ఎంత బండ చాకిరీ చేసినా, మెప్పులేకుండా తిట్లు తింటూ వుండేవాడు. ఒకరోజున అతడు సంతనుండి తిరిగివస్తూ, పులివాత పడనున్న రాకుమారిని రక్షించాడు. ఆ సందర్భంగా అతడి బండి, ఎద్దు కనిపించకుండా పోయాయి. వాటికోసం, అతడు అడవి అంతా గాలిస్తూ వుండగా, ఓ చోట అతడికి ఓ స్వాములవారు కనిపించారు. ఆ స్వాములవారి అరిచేతిలో ఆనందుడికి రాజుగారి పశువుల శాలా, అందులో అతడి ఎద్లూ, వాటిని మేస్తూ రాజకుమారి విజయవతీ కనిపించారు. ఇక చదవండి.]

"యోగీశ్వరా! యోగీశ్వరా! ఇదేమి వింత! నా ఎద్దులకు భద్రావతీ నగర రాజకుమార్తె విజయవతి స్వయంగా గడ్డిమేపుతూ వుండటం ఏమిటి? నేనేమైనా కలగనటం లేదుగదా?" అన్నాడు ఆనందుడు ఎక్కడలేని ఆశ్చర్యంతో.

ఆ మాటలకు యోగి చిరునవ్వు నవ్వి, "నాయనా, ఇందులో ఆశ్చర్యపడవలసిందీ, వింతపడవలసిందీ ఏమీలేదు. నీ ధైర్య సాహసాలకు మెచ్చి రాజకుమారి నిన్ను ప్రేమించింది. ఆమెను పులిబారినుంచి కాపాడావు కదా?" అన్నాడు.

ఆనందుడు ఒక క్షణకాలం ఆలోచించి, తల అడ్డంగా ఊపుతూ, "యోగీశ్వరా, ఇది నమ్మదగిన మాటగాలేదు. పులివాత బడకుండా, ఆమెను రక్షించినంత మాత్రానికే, నన్ను రాజకుమారి ప్రేమించినట్టయితే, రేపు మరొకడామెను సింహం నోటబడకుండా రక్షించాడనుకోండి. అప్పు డేమవుతుంది?" అన్నాడు.

ఆనందుడి భావం గ్రహించిన యోగి చిన్నగా నవ్వుతూ, "నాయనా! నువ్వనుకున్నట్టు జరిగినా, నిన్నామె ప్రేమించటం మానదు. నీది బహు గొప్పజాతకం! నీతో ఆ రాకుమార్తె ఒక్కదానికేగాక, నాకూ మరి కొందరికి కూడా పని వున్నది. ఆ మహత్కార్యం నీవు నెరవేర్చిననాడు, భద్రావతీ



నగర రాజైన ఇంద్రసేనుడి అల్లుడవైపోతావు. ఒకవేళ ఆ కార్యసాధనలో నీకేమైనా ప్రాణాపద కలిగితే....” అంటూ యోగి తన పక్కన వున్న తాళపత్రాలు కొన్ని పరీక్షించిచూసి, “నాయనా! ఆ కనబడే పెద్ద ఊడల మర్రి చెట్టును చూశావా? అది దాదాపు నాలుగు వందల ఎకరాల స్థలాన్ని ఆక్రమించి వున్నది. దాని అసలు బోదె ఒకానొక మహావీరుడి అగ్నేయాస్త్రానికి కాలి బూడిద అయిపోగా, ఆ వృక్షం కేవలం తన ఊడల ఆధారంతో నిలబడి వున్నది. దానికి ఖరదూషణులనే రాక్షసులు, యీ దండకారణ్య ప్రాంతాలను పరిపాలించటంకూడా తెలుసును!” అన్నాడు.

యోగి మాటలు ఆనందుడికి కొంచెం భయాన్ని కలిగించినై. అరణ్యంలోని ఒకానొక మారుమూల పల్లెలో సేద్యం చేసుకు బతికే తను, హఠాత్తుగా యిలా ఒక రాజకుమార్తెతో, ఒక యోగీశ్వరుడితో, ఖరదూషణులనే రాక్షసుల నెరిగిన ఊడల మర్రితో సంబంధం కలుపుకోవటం—చోద్యంగానే కాక, భీతి పుట్టించేదిగా కూడా వున్నది.

ఆనందుడు మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తూండటం గమనించిన యోగి, అతడి భుజంతట్టి, “నాయనా! నువ్వేం ఆలోచిస్తున్నావు? సుఖంగా ఇంటిపట్టున బతికే ప్రాణాన్ని ఏదో చిక్కుల్లో పెట్టుకోబోతున్నానని భయపడుతున్నావా? అలా అయితే నువ్విప్పుడే మీ పల్లెకు వెళ్ళిపోవచ్చు; నా అభ్యంతరంలేదు” అన్నాడు.

పల్లెకు తిరిగిపోవటం ఆనందుడి కేమాత్రం యిష్టంలేదు. అక్కడ పొద్దస్తమానం గోవిందస్వామిచేతా, లక్ష్మమ్మచేతా తిట్లు తినటంతోటే యింతకాలం జరిగిపోయింది. ఈ యోగి సహాయంతో వీలయితే ధనం సంపాయించి, రాజకుమార్తెను పెళ్ళాడటంలో సుఖంవుందనీ, ఆ ప్రయత్నంలో మరణించినా ఫర్వాలేదనీ నిశ్చయించుకున్నాడు ఆనందుడు.

“యోగీశ్వరా! నేను బతికున్నంతకాలం మీ సేవలోనే గడపదలిచాను. మీరు అంజనం వేసి ఎక్కడోవున్న రాజకుమార్తెను అరిచేతిలో చూపడం చూసిం తరవాత, మీరు గొప్ప

అద్భుతాలు చేయగలరన్న నమ్మకం నా క్కలుగుతున్నది," అన్నాడు అనందుడు.

యోగి, అనందుడి తలమీద చేయివేసి దీవించి, "నాయనా, నువ్వు బతికి వున్నంత వరకూ నాకు సేవ చేయ నవసరంలేదు. నే వెతుకుతున్న జాతకుడివి దొరికావు. నీవల్ల ఒక గురుకార్యం సాధించి, నిన్ను మహా రాజులకన్న సంపన్నుణ్ణి చేసి, ఇంటికి పంపు తాను. కాని, ఆ కార్యసాధనలో నువ్వు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం వుంది, ముందే హెచ్చరిస్తున్నాను," అన్నాడు యోగి.

"ఆ హెచ్చరిక ఒకసారి చేశారు; నాకు ప్రాణం అంటే అంత తీపిలేదు. ఈ క్షణం నుంచీ తమ శిష్యుణ్ణి!" అంటూ అనందుడు యోగికి సాష్టాంగపడ్డాడు.

యోగి, అతణ్ణి లేవనెత్తి, తన కుటీరానికి తీసుకుపోయి, అందులో ఒక గదిని అనం దుడికి చూపుతూ, "ఆనందా! యీ నాటి నుంచీ యీ గది నీ సొంతం. నా ఆహారం కందమూలాలూ, పళ్ళూ ఫలాలే. నువ్వు మాత్రం నీ యిష్టమైన ఆహారం సంపాదించు కుని తినవచ్చు. గురుకార్యం సాధించటానికి మనం బయలుదేరేందుకు, మంచి ముహూర్త మేదో నేను వీలువెంట నిర్ణయిస్తాను," అన్నాడు.

ఆ తరవాత కొంతసేపటికి సూర్యాస్తమయ మయింది. ఆనందుడు యోగి యిచ్చిన



పళ్ళూ ఫలాలూ తిని, గదిలో పరిచివున్న పులి, లేడి చర్మాలమీద పడుకున్నాడు. అతడికి సరిగా నిద్రపట్టలేదు. తన భవిష్యత్తు ఎలా వుండబోతుందో నన్న భయం, తనెలాటి ప్రమాదాలను ఎదుర్కోవలసి వుంటుందో అన్న సంశయాలూ అతణ్ణి బాధించ సాగాయి. ఇంతకూ యీ యోగి నమ్మదగిన వాడేనా, లేక తనను ఏ దుష్టశక్తికో బలి యిచ్చేందుకు యీ కపట నాటకం అంతా ఆడుతున్నాడా?

ఆనందుడు ఇలాటి ఆలోచనలతో వుండగా, ఊడలమర్రి వైపునుంచి ఏవో భీతిగొలిపే ధ్వనులు వినిపించసాగాయి. గుడ్డివెన్నెల కాంతిలో ఆ చెట్టు మహా భయంకరంగా వున్నది. పట్టపగలే ఆ చెట్టుకింప చీకటి



గుయ్యారంగా వుంటుంది. దాని మీద ఏవో రాక్షస గణాలున్నట్టు యోగి సూచనప్రాయంగా చెప్పాడు.

ఇలా ఆలోచిస్తున్న ఆనందుడికి హఠాత్తుగా గది ద్వారానికి అడ్డంగావున్న వెదురు తడికెను పక్కకు తొలగదోసి, ఏదో నల్లని ఆకారం ఒకటి గదిలోకి ప్రవేశించటం కనబడింది. అతడు గొంతెత్తి ఏదో అనబోయే లోపలే ఆ ఆకారం గదికి ఒక మూలగా అతను నిలబెట్టిన దుడ్డుకర్రను చేతికి తీసుకుని చప్పున బయిటికి వెళ్ళిపోయింది.

ఆనందుడికి ఆ నల్లని ఆకారాన్ని చూసి నప్పుడు కొంచెం భయం కలిగినా, అది తను ప్రాణప్రదంగా చూసుకునే దుడ్డు కర్రను తీసుకుపోవటం చూడగానే భయం పోయి, ఎక్కడలేని కోపం వచ్చింది. అతడు ఆ ఆకా రాన్ని 'ఆగు' అని హెచ్చరించబోయి, పక్క గదిలో వున్న గురువుకు నిద్రాభంగ మవుతుం దని సంశయించి, చప్పున లేచి గది బయిటికి పోయాడు.

ఆ ఆకారం దుడ్డుకర్రను తలమీద పెట్టు కుని, చకచకా ఊడలమర్రికేసి, నడవసాగింది. "ఎవరది? ఆగు!" అంటూ ఆనందుడు దాన్ని అనుసరించాడు.

ఆ ఆకారం యీసారి వేగంగా పరిగెత్త సాగింది. ఆనందుడు ఆ చీకట్లో దారి సరిగా కానక కిందపడి లేస్తూ, ఊడల మర్రికేసి పోసాగాడు. చూస్తుండగానే ఆ నల్లని ఆకారం ఊడలమర్రి కింద చిమ్మచీకట్లో కలిసి పోయింది.

ఆ సమయంలో ఆనందుడికి భయం కలి గినా, అంతకన్నా కోపం రెట్టింపయింది. తాను ఉంటున్న గదిలో ప్రవేశించి దుడ్డుకర్రను, యీ ఊడల మర్రిమీద వుండే ఏ రాక్షసుడో, పిశాచమో ఎత్తుకు పోయిందన్న మాట! పని గట్టుకుని ఆ దుడ్డుకర్ర కోసం అదెందుకు వచ్చిందన్న అనుమానం మాత్రం అతడి క్కలగలేదు.

ఆనందుడు నిర్భయంగా ఊడలమర్రి కిందకి పోయాడు. కొంచెంసేపు అక్కడి చీకటి లోకి కళ్ళు చిలికించి పరీక్షగా చూడగా,



ఎక్కడ చెట్టు ఊడలు భూమిలోకి దిగి నయ్యో, ఎక్కడ నడిచేందుకు ఖాళీ ప్రదేశా లున్నవో అతడికి లీలగా కనిపించినై. వెంటనే అతడు పెద్దగా గొంతెత్తి, "ఎవర్రా ఆ దుర్మా ర్గుడు! నా దుడ్డుకర్రను తిరిగి యిస్తావా, లేక నాచేత చావుదెబ్బలు తింటావా?" అంటూ కేక వేశాడు.

ఆనందుడి కేకకు ఎవరూ జవాబు పలక లేదు. కాని, చీకటిలో తడుపుకుంటూ ముందుకు పోతున్న అతడికి ఎవరో గుసగుస లాడుతున్న ధ్వని వినిపించింది. అతడు ఆ దిక్కుగా కొంతదూరం పోయేసరికి, హఠా త్తుగా ఒకచోట పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగుకు కారణం, ఒక ఊడకు వేలాడకట్టిన పెద్ద మణి! దాని కాంతిలో ఇద్దరు రాక్షసులు ఆనందుడి కంటబడ్డారు. వాళ్లు కళ్లు మూసు కుని కూర్చుని వున్నారు. వాళ్ళ ముందు అతడి దుడ్డుకర్ర నిలబెట్టబడి వుంది. దాని నుంచి ఒక పూలహారం వేలాడుతున్నది.

ఆనందుడు ఎంతో ఆశ్చర్యంతో ఆ రాక్షసుల దగ్గిరకు పోయాడు. వాళ్ల వాలకం చూస్తుంటే ఆ ఇద్దరూ తన దుడ్డుకర్రకు పూజచేస్తున్నట్టు కనిపించింది. అతడు ఒకటి రెండు నిముషాలు మౌనంగా నిలబడి, రాక్షసులు ఎంతకూ కళ్లు తెరవకపోయేసరికి, వాళ్ళల్లో ఒకడి భుజం పట్టుకుని కుదుపుతూ, "ఏమిటీ తమాషా? నా దుడ్డుకర్ర ఏమైనా రామబాణం అను కున్నారా, ప్రాణాచారాలు పడిపోతున్నారు?" అన్నాడు.

రామబాణం మాట వింటూనే రాక్షసు లిద్దరూ కళ్లు తెరిచి కుయ్యోమంటూ పెద్దగా "ఒరే మానవ యువకుడా! నీ ధైర్యానికి మెచ్చాం. కాని, నువ్వు మా శత్రువుల పేర్లు పలికి మాకు కోపం తెప్పించకు," అన్నారు.

తనన్న మాటలు రాక్షసులకు భయం కలి గించినవని గ్రహించిన ఆనందుడు యీసారి మరికొంత ధైర్యంతో, "మీ ఆకారాలు చూస్తే రాక్షసుల్లా వున్నారు, కాని బుద్ధులు తక్కువ జాతి పిశాచాల బుద్ధుల్లా వున్నవి. నా దుడ్డు కర్ర నా కిచ్చేయండి, పోవాలి" అన్నాడు.

ఆనందుడిలా అనగానే రాక్షసు లిద్దరూ


ముఖాముఖాలు చూసుకుని, అబ్బుర పడి పోయారు. వాళ్ళల్లో ఒకడు ఆనందుణ్ణి నఖ శిఖ పర్యంతం ఒకసారి పరీక్షగా చూసి, "ఒరే, కుఱ్ఱాడా! నీ జాతకం ఎంత అమోఘ మయిందో, నీ ధైర్యంకూడా అలాగే సాటి లేనిది. చీకటి పడితే చాలు మనుషులు, యీ ఊడలమఱ్ఱికి కోసు దూరంలోకైనా రావటానికి భయపడతారు. అలాంటిది నీవు అర్ధరాత్రివేళ యీ మఱ్ఱి కిందకి వచ్చి మమ్మల్ని చూసి, గుండె పగిలి చావకపోగా, దుడ్డుకఱ్ఱ యివ్వ మని గొడవ చేస్తున్నావు!" అన్నాడు.

"నా జాతకం గొప్పదని ఆ ఆశ్రమంలో వుండే యోగీశ్వరుడు చెప్పాడు. అదలా వుంచండి. ముందు నా దుడ్డుకఱ్ఱ యిస్తారా, లేకపోతే మీ యిద్దర్నీ బడితపూజ చేయ మంటారా?" అంటూ ఆనందుడు ఒక ఎండుకొమ్మ పుల్లనుచేతికి తీసుకున్నాడు.

రాక్షసు లిద్దరూ ఆనందుడికేసి చూసి "ఒరే కుఱ్ఱాడా! మా క్కావలసిన జాతకుడివి యింత కాలానికి దొరికావు. మా వల్ల నీకు ధన ప్రాప్తి, నీ వల్ల మాకు రాజ్యప్రాప్తి కలగవలసి వుంది," అన్నారు.

పొన్నచెట్టు కింద కూర్చునే యోగీ, యీ ఊడలమఱ్ఱి నాశ్రయించి బతికే యీ రాక్షసులూకూడా తనది గొప్ప జాతకం అంటూంటే, ఆనందుడికి, వీళ్ళ మాటల వెనక ఏదైనా పెద్ద మోసం వున్నదేమో అనిపించింది. వీళ్ళంటు న్నట్టు తనదంత గొప్ప జాతకం అయితే, యింతకాలంగా గోవిందస్వామిచేతా, లక్ష్మమ్మ చేతా నానా తిట్లూ తింటూ, వాళ్ళకోసం అడ్డ మైన చాకిరీ చేస్తూ ఎందుకు బతికినట్టు?

ఆనందుడిలా ఆలోచిస్తున్నంతలో రాక్షసుల్లో ఒకడు ధగ ధ్ధగాయమానంగా వెలిగి పోతున్న మణిని అతడికి చూపుతూ, "ఒరే, కుఱ్ఱాడా! ఈ మణిలాటిది మరొకటి యీ లోకంలో ఏ రాజువద్దా లేదు. నీ కిలాటి మణులు మోయగలిగినన్ని యిస్తాం. ఏమంటావు?" అన్నాడు. (ఇంకా వుంది)



Check List

Book Number	PAK04A215	Date	29/07/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Ch. Ramya	Cutting By	Ch. Ramya
Scanned By	Amrutha	Pages	49